



పుణ్యస్నానాలకు చెరువు ఒడ్డున ఏర్పాటు చేసిన షవర్లు

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

- నేడు బోగసముద్రం చెరువులోకి మహాకుంభ్ జలాలు
- పుణ్యస్నానాలకు అవకాశం

పెనుకొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక బోగసముద్రం చెరువు లోని యోగముద్ర ఈశ్వరుడి వద్ద రెండ్రోజుల పాటు నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తీ చేసినట్లు చెరువు జలవన సంరక్షణ సమితి సభ్యులు తెలిపారు. శనివారం చెరువు వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో కమిటీ సభ్యులు పాపారాయుడు, రమేష్‌రాయల్, రాజశేఖర్‌రెడ్డి, వినోద్‌కుమార్, గిరి, చంద్రమౌళి, శ్రీరామ్, పూర్ణా తదితరులు మాట్లాడుతూ.. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 25న అంకురార్పణ, కళశపూజ, గణపతి, గంగపూజ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 26న శివరాత్రి పండగ సందర్భంగా ఉదయం స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, సాయంత్రం 6 నుంచి రాత్రి 12గంటల వరకు విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, రాత్రి 12 నుంచి ఉదయం 5గంటల వరకు కాంతార సాంస్కృతిక నృత్యాలు, కేరళ వాయిద్య బృందంచే ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాధ్యాన యోగేశ్వర స్వామి సన్నిధిలో శివరాత్రి జాగరణ చేసి భక్తులందరూ పునీతులు కావాలని కోరారు.

నేడు బోగసముద్రం చెరువులో పుణ్యస్నానాలు

స్థానిక బోగసముద్రం చెరువులో జల వన సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ప్రయాగ్‌రాజ్ నుంచి తెచ్చిన గంగ, యమున, సరస్వతి, పవిత్ర జలాలతో బోగసముద్రం చెరువులో పవిత్ర స్నానాలు చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 9గంటలకు ఊరువాకిలి ఆంజనేయస్వామి ఆలయం నుంచి మేళ తాళాలతో ఊరేగింపుగా పవిత్ర జలాల కళశాలను బోగసముద్రం చెరువువద్దకు తీసుకెళతామన్నారు. శివలింగానికి అభిషేకం చేసి ఆ పవిత్ర జలాలను బోగసముద్రం చెరువులో కలిపి భక్తులకు మహాకుంభమేళ పవిత్రస్నానాలకు అవకాశం కల్పిస్తామన్నారు. చెరువులో దిగి స్నానం చేయలేని వృద్ధులు, పిల్లల కోసం వడ్డున షవర్లను ఏర్పాటు చేశామని తెలిపారు.

క్యాన్సర్.. కబళిస్తోంది..!



స్క్రీనింగ్ పరీక్షలతో వెలుగులోకి..

- జిల్లాలో 4,89,195 మందికి టెస్ట్
- 162 మందికి క్యాన్సర్ నిర్ధారణ
- బాధితులలో మహిళలు 112 మంది..
- రంగు రంగుల ఆహారంతో ప్రమాదం
- మారిన జీవన విధానమూ ఓ కారణం



పుట్టపర్తి మండలం జగరాజుపల్లిలో స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తున్న వైద్యులు

పుట్టపర్తి రూరల్, కొత్తచెరువు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ బాధితుల సంఖ్య జిల్లాలో పెరుగుతోంది. మహిళల్లోనే అధికంగా క్యాన్సర్ బయట పడుతోంది. తొలిదశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయగలిగే అవకాశం ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో కొత్త క్యాన్సర్ కేసులు బయటపడుతున్నాయి. జిల్లాలో 18 సంవత్సరాల వయసు పైబడిన వారు 15,57,852 మంది ఉన్నారు. వీరిలో ఇప్పటివరకు 4,89,195 మందికి స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించామని ఎపిడామాలజిస్టు బాలజీనాయక్ తెలిపారు. ఫలితాల ఆధారంగా హైపర్‌టెన్షన్ రోగులు 27,503 మంది, డయాబెటిక్ బాధితులు 16,029 మంది, పై రెండూ ఉన్నవారు 31,420 మంది ఉన్నారు. ఇప్పటి వరకూ నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్షల ఆధారంగా బ్రెస్టు క్యాన్సర్ 37 మందికి, సర్వైకల్ క్యాన్సర్ 75 మందికి, ఓరల్ క్యాన్సర్ 40 మందికి ఉన్నట్లు గుర్తించారు. జిల్లాలో ఇంతకు మించి బాధితులు ఉన్నారని అంటున్న అధికారులు, గణాంకాలను వెల్లడించం లేదు. సర్వే ఆధారంగా వివిధ రకాల క్యాన్సర్ బాధితులు 162 మంది ఉన్నారని మాత్రమే చెబుతున్నారు. కదిరి, హిందూపురం, పెనుకొండ ప్రాంతాలలో క్యాన్సర్ బాధితులు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. వీరు కర్నూలు, హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ ప్రాంతాలలో చికిత్స చేయించుకుంటున్నారు.



మొదటే గుర్తించాలి..



క్యాన్సర్‌ను సకాలంలో గుర్తించాలి. అప్పుడే పూర్తిస్థాయిలో నయం చేసే వీలు ఉంటుందని వైద్య నిపుణులు అంటున్నారు. ఆలస్యంగా గుర్తిస్తే ఇది ప్రమాదకరంగా పరిణమిస్తుంది. శరీరంలో ఏ భాగంలోనైనా క్యాన్సర్ రావచ్చు. శరీరంలో కణాలు అదుపులేకుండా పెరిగే స్థితి క్యాన్సర్‌కు దారితీస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం అత్యధిక మరనాలకు క్యాన్సరే కారణం. పురుషులలో ఊపిరితిత్తులు, ప్రోస్టేట్, కడుపు, లివర్, నోటి క్యాన్సర్ ఎక్కువగా వస్తాయి. మహిళల్లో బ్రెస్ట్, పోలోరెక్టాల్, ఊపిరితిత్తులు, గర్భాశయ థైరాయిడ్ క్యాన్సర్ కనిపిస్తున్నాయి. దేశంలో 40 లక్షల మంది క్యాన్సర్ బాధితులు మృతి చెందినట్లు ఇటీవలి గణాంకాలు చెబుతున్నాయి. మంచి వైద్యం, ధైర్యంగా ఎదుర్కొనడంద్వారా క్యాన్సర్ నుంచి బయటపడవచ్చునని వైద్యనిపుణులు తెలియజేస్తున్నారు.

ఆపదలో అతివలు

జిల్లాలో ప్రభుత్వ స్క్రీనింగ్ టెస్టుల ద్వారా ఇప్పటి వరకూ బయట పడిన క్యాన్సర్ కేసులు 162 కాగా, ఇందులో మహిళలు ఏకంగా 112 మంది ఉన్నారు. రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ బారిన ఎక్కుమంది పడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్ బాధితుల సంఖ్య తక్కువగా ఉంది. పట్టణ ప్రాంతాలలో కూర్చుని పనులు చేసేవారిలో స్థూలకాయం కారణంగా క్యాన్సర్ వస్తోందని వైద్య నిపుణులు అంటున్నారు. బాల్య వివాహాలు, పిల్లలకు పాలివ్వకపోవడం తదితర కారణాలతో రొమ్ము క్యాన్సర్ వస్తోందని అంటున్నారు. సరైన వ్యాయామం చేయకపోవడం, రుతుక్రమం సరిగా లేకపోవడం, మల్టిపుల్ సెక్సువల్ కాంటాక్టు వంటి కారణాలతో గర్భాశయ క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని అంటున్నారు.

ఆహారం కూడా..

ఆహార కాలుష్యం కూడా క్యాన్సర్‌కు కారణమౌతోంది. పంటలకు అధిక మోతాదులో రసాయన మందులు, ఎరువులు వాడటం, కలుపుగడ్డిని నివారించడానికి రసాయనాలు వాడటం కారణంగా క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో రుచికోసం టేస్టింగ్ సాల్ట్ అధిక మోతాదులో వాడటం, ఆకర్షించేందుకు రంగులను వాడటం, ప్లాస్టిక్ వస్తువులలో వేడివేడి ఆహార పదార్థాలను తీసుకోవడం కూడా క్యాన్సర్ బారినపడుతున్నారని వైద్యులు తెలియజేస్తున్నారు. గుట్కా, ధూమపానం, మద్యం తాగేవారిలోనూ ఎక్కువమంది క్యాన్సర్ బారిన పడుతున్నారని గుర్తించారు.

ఎలా గుర్తించాలి..?

జ్వరం, రక్తస్రావం, ఆహారం మింగడం కష్టంగా మారడం, విపరీతమైన అలసట, ఆగకుండా దగ్గురావడం, గొంతు బొంగురుపోవడం, అతిగా బరువు తగ్గిపోవడం, ఆకలి మందగించడం, శరీరంపై కొత్త పుట్టుమచ్చలు ఏర్పడటం, వాటిలో మార్పులు రావడం, గాయాలు నయం కాకపోవడం, మూత్ర విసర్జన సమయంలో నొప్పి, మూత్రంలో రక్తం రావడం వంటి లక్షణాలు కనిపిస్తే క్యాన్సర్‌గా అనుమానించాలి. వెంటనే వైద్య నిపుణులను సంప్రదించాలి.

అవగాహన కల్పిస్తున్నాం..



క్యాన్సర్ మహమ్మారి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. తొలిదశలోనే గుర్తించగలిగితే వ్యాధిని అదుపుచేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. క్యాన్సర్ బారిన పడినవారు మానసికంగా కుంగిపోతుంటారు. వారు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. మనజీవనవిధానం, ఆహారపు అలవాట్లతోనే ఎక్కువగా క్యాన్సర్ సోకుతోంది. జిల్లాలో గొంతు, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ బాధితులను ప్రారంభ దశలోనే గుర్తించి, మెరుగు చికిత్సల కోసం క్యాన్సర్ వైద్యాలయాలకు పంపుతున్నాము. ఆరోగ్య ఉపకేంద్రాల్లో క్యాన్సర్‌పై ప్రజలకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాము.

- ఫైరోజ్ బేగం, డీఎంహెచ్ఓ

కంపు నీరే గతి..!

పైకప్పు లేక.. ఓవర్ హెడ్ ట్యాంకులో చెత్తాచెదారం

ఇరవై ఏళ్ల కిందట నిర్మించిన ట్యాంకు.. పైన మూత లేదు. చుట్టుపక్కల చెట్లు దానికన్నా ఎత్తుకు పెరిగిపోయాయి. ఆ ఆకులు నేరుగా రాలి ట్యాంకులో పడుతున్నాయి. అవి కుళ్లిపోయి నీరు కంపు కొడుతోంది. ట్యాంకు పాచి పట్టిపోయింది. మరోవైపు పెచ్చులూడిపోతున్నాయి. బోరులో సమృద్ధిగా నీరు ఉన్నా ట్యాంకు నుంచి సరఫరా కావడం లేదు. పైపులకు చెత్తాచెదారం, పెచ్చులు అడ్డు పడి సగం ఊరికి కూడా అందడం లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యంతో పడమటివారిపల్లి వాసులు తాగునీటి కోసం తల్లడిల్లుతున్నారు.

- ఊడిపోతున్న పెచ్చులు.. కారిపోతున్న నీరు
- నీరున్నా సగం గ్రామానికి సరఫరా కాని వైనం
- పడమటివారిపల్లిలో తాగునీటి కటకట



మూత లేని ట్యాంక్



ట్యాంకు లోపల ఊడిన పెచ్చులు



పడమటివారిపల్లి వద్ద ఏర్పాటు చేసిన నీటి ట్యాంక్

తనకల్లు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోంది. రెండు రోజుల కిందటే ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేశారు. ఇంత వరకూ బాగానే ఉంది. ఇవేవీ తమకు సంబంధం లేదన్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ శాఖల అధికారులు వ్యవహరిస్తున్నారు. నీరున్నా సరఫరా చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. తనకల్లు మండలంలోని పడమటివారిపల్లిలో నీటి ఎద్దడే ఇందుకు నిద

ర్శనం. గ్రామంలో 70కి పైగా కుటుంబాలు ఉన్నాయి. అందులో 40 ఇళ్లకు నీరు రావడంలేదని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలోని పాఠశాల వద్ద సత్యసాయి నీటి పథకంలో భాగంగా ట్యాంక్‌ను నిర్మించారు. ఇక్కడి నుంచి గ్రామంలోకి పైపులైన్లు ఏర్పాటు చేశారు. ఓవర్ హెడ్ ట్యాంక్ చుట్టూ పాఠశాల ఆవరణంలో నీటి ట్యాంక్ కంటే ఎత్తుగా వివిధ రకాల చెట్లు పెరిగిపోయాయి. నీటి ట్యాంక్‌కు పై భాగంలో మూత లేకపోవడంతో చెట్ల ఆకులు అందులో పడి కుళ్లుతున్నాయి. గ్రామస్థులు ఆ నీటినే ఉపయోగించుకోవాల్సి వస్తోంది. ఆ నీటి ట్యాంక్‌ను శుభ్రం చేసి ఎన్ని సంవత్సరాలు అయిందోనని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని సగం ఇళ్లకు నీరు రాకపోయినా పట్టించుకునే నాథుడే లేడు. ఈ విషయాలను సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులకు, టోల్ ఫ్రీ నెంబర్లకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. 20 సంవత్సరాల క్రితం నిర్మించిన ట్యాంక్‌కు లోపలంతా పెచ్చులు ఊడిపోయాయి. ట్యాంక్‌కు నీరు పట్టిన వెంటనే కారుతోంది. పైపులో పెచ్చులు, కుళ్లిన ఆకులు అడ్డుపడడంతో నీరు రావడంలేదు. దీంతో గ్రామస్థులు ప్రతిరోజూ నీటికోసం ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి పడమటివారిపల్లిలో నెలకొన్న నీటి ఎద్దడిని నివారించడానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు



మా గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ ఉంది. బోరులో నీరు పుష్కలంగా ఉన్నాయి. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మా పరిస్థితి తయారయింది. ప్రతిరోజూ నీటికోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నీటి ట్యాంక్‌కు నీరు పట్టిన వెంటనే జల్లెడలో పోసినట్లు కారిపోతున్నాయి. అధికారులకు చెప్పినా పట్టించుకునే దిక్కులేరు.

- రామమోహన్, పడమటివారిపల్లి

కంపు నీరే దిక్కు



గ్రామంలోని పాఠశాల వద్ద నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌కు పైకప్పు మూత లేకపోవడంతో చెట్ల ఆకులన్నీ అందులో పడుతున్నాయి. ఆకులు కుళ్లి, కంపు కొడుతున్న నీటినే వాడుకోవాల్సి వస్తోంది. సగం గ్రామానికి నీరు రాలేదు. అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా మా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నాం.

- రమణప్ప, పడమటివారిపల్లి

వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు



గ్రామంలోని చాలా మంది ఇతర ప్రాంతాల్లో వ్యవసాయ పనుల కోసం వెళతారు. తిరిగి రాత్రికి చేరుకుంటారు. సగం గ్రామానికి ట్యాంక్ నీరు రాలేదు. దీంతో రాత్రి సమయంలో వ్యవసాయ బోర్ల వద్దకు నీటికోసం పరుగులు తీయాల్సి వస్తోంది. గ్రామంలోకి వచ్చే అధికారులు ఎవరూ నీటి గురించి పట్టించుకోలేదు. సమస్య ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్నాం.

- చౌడప్ప, పడమటివారిపల్లి

నాలుగురోజుల్లో పరిష్కరిస్తాం

గ్రామంలో కొన్ని ఇళ్లకు నీరు రావడంలేదని నా దృష్టికి వచ్చింది. ఈ విషయంపై సర్పంచ్‌తో చర్చించాం. నాలుగు రోజుల్లో ట్యాంక్ మరమ్మతులు చేయిస్తాం. పైకప్పు మూత వేయించి గ్రామంలో అందరికి తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటాం.

- ఉదయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి

క్రైం పోలీసుల కోసం అన్వేషణ

- ముందుకు రాని సిబ్బంది
- పెరిగిపోతున్న నేరాలు
- తప్పించుకుంటున్న దొంగలు
- స్టేషన్లో ఉంచేందుకు జంకుతున్న ఎస్‌హెచ్‌ఓలు

హిందూపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఏదైనా నేరం జరిగితే నిందితులను పట్టుకొని సొమ్ము రికరవరీ చేసి, వారిని కోర్టులో హాజరుపరిచే వరకు పోలీసుల విధులు కత్తిమీద సాములా ఉంటాయి. సాంకేతిక పరిజ్ఞానం పెంపొందడంతో గతం కంటే కొంత పరిస్థితి మెరుగయింది. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నాక వారు తప్పించుకున్నా, విచారణ సందర్భంగా ఏదైనా అఘాయిత్యానికి పాల్పడినా పోలీసులకు పెద్ద సవాలుగా మారుతోంది. మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్‌ను పట్టుకోవడానికి పోలీసులు పడరాని పాట్లు పడుతున్నారు. ఒకప్పుడు పోలీస్ స్టేషన్లలో ఎస్‌హెచ్‌ఓలు స్టేషన్‌కి ఇద్దరు లేక ముగ్గురు సిబ్బందిని క్రైం పార్టీకి తీసుకునేవారు. ఇది ప్రతి పోలీస్ స్టేషన్లో సాధారణంగా జరిగే వ్యవహారం. సిబ్బంది ఎస్‌హెచ్‌ఓలకు నమ్మకస్థమైన వ్యక్తులుగా ఉండాలి. కొన్ని ముఖ్యమైన కేసులను రెండు మూడు రోజులు కొన్ని సందర్భాల్లో వారం రోజులు స్టేషన్లోనే పెట్టుకొని విచారణ చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం హిందూపురం సబ్‌డివిజన్లో క్రైంపార్టీ సిబ్బంది లేక పోలీసు అధికారులు నానా ఇబ్బంది పడుతున్నారు. సాధారణంగా క్రైం పార్టీ సిబ్బంది ఓ వైపు నేరస్థులను గుర్తించాలి, మరో వైపు నేరాలకు అడ్డుకట్ట వేయాలి. ఇదే సందర్భంలో నేరస్థులతో కూడా సఖ్యతగా ఉండాలి. అలా ఉంటేనే మరికొన్ని నేరాలకు సంబంధించిన నిందితులను పట్టుకోవడానికి వీలుంటుంది. ఇటీవల పోలీస్ శాఖలో జరిగిన సంఘటనల నేపథ్యంలో హిందూపురం సబ్‌డివిజన్లో క్రైం పార్టీ పోలీసులు లేక కేసుల విచారణలో జాప్యం జరుగుతోందని తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో నమ్మకస్థులైన సిబ్బంది కోసం పోలీసు అధికారులు జల్లెడ పడుతున్నారు. ప్రస్తుతం కొంత మంది సిబ్బంది సులభంగా ఉండే విధులను ఎంచుకొని పొద్దుగడిపేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీంతో సబ్‌డివిజన్‌కు క్రైం పార్టీ పోలీసులు కావాలని అధికారులు ఆరా తీస్తున్నారు.

విచారించడానికి జంకుతున్న పోలీసులు

నిందితులను విచారించేందుకు పోలీసు అధికారులు జంకుతున్నారు. ఇటీవల విచారణ సందర్భంగా చోటుచేసుకున్న సంఘటనలే ఇందుకు కారణమని చెప్పవచ్చు. కొద్ది నెలల క్రితం దోపిడీ కేసుకు సంబంధించి నిందితుడిని అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్లో ఉంచారు. అక్కడ కాపలాగా ఉన్న సిబ్బంది రైలులో వెళ్లడానికి సమయం అయిందని వెళ్లిపోయారు. దీంతో ఆ నిందితుడు స్టేషన్ నుంచి తప్పించుకొని వెళ్లిపోయాడు. నెల క్రితం హిందూపురం సబ్‌డివిజన్ పరిధిలోని ఒక పోలీసుస్టేషన్‌కు కర్ణాటకకు చెందిన ఓ నిందితుడిని విచారణ కోసం తీసుకు వచ్చారు. అక్కడ కాపలా ఉన్న సిబ్బంది నిర్లక్ష్యంతో ఆ నిందితుడు వెనకాల వైపు నుంచి వెళ్లిపోయాడు. వెంటనే స్టేషన్ అధికారి అలర్ట్ కావడంతో పట్టుకున్నారు. రెండు నెలల క్రితం పట్టణంలోని ఓ పోలీస్‌స్టేషన్లో నిందితుడిరి విచారణ కోసం తీసుకువచ్చి గదిలో ఉంచారు. కాపలా ఉన్న కానిస్టేబుల్ కునుకుతీయడంతో నిందితుడు అక్కడ నుంచి తప్పించుకుని వెళ్లిపోయాడు. హిందూపురం నుంచి 250 కిలో మీటర్ల దూరం వెళ్లిపోయాక ఎలాగో ప్రయాసపడి అదుపులోకి తీసుకున్నారు. తాజాగా పట్టణంలో విచారణకు వచ్చిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు ఆలస్యంగా గుర్తించారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇంకా తెలియనివి చాలానే ఉన్నా యి. ఈ కారణంగా నిందితులను స్టేషన్లో విచారించేందుకు ఎస్‌హెచ్‌ఓలు జంకుతున్నారు. నమ్మకస్థైన సిబ్బంది కోసం పోలీస్ అధికారులు అన్వేషిస్తున్నారు.



జూన్ 10లోగా పూర్తి చేయాలి

- హంద్రీనీవా లైనింగ్ పనులపై కలెక్టర్



హంద్రీనీవా కాలువ లైనింగ్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి ప్రధాన కాలువ సిమెంటు లైనింగ్ పనులను ఈయేడాది జూన్ 10లోపు పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో హంద్రీనీవా ప్రాజెక్టు ఇంజనీర్లతో కాలువ లైనింగ్ పనుల మ్యాప్‌ను కలెక్టర్ పరిశీలించి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు చేపట్టిందని, నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి అధికారులు, ఇంజనీర్లు శక్తివంచన లేకుండా పనిచేయాలని తెలిపారు. జిల్లాలో పేజ్-2ద్వారా 260 కిలో మీటర్ల నుంచి 404 కిలో మీటర్ల వరకు లైనింగ్ పనులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎన్ఎస్ఎస్ ఎస్ఈ స్వరూప్‌కుమార్, ఈఈలు మురళి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

లోక కళ్యాణం కోసం..



యజ్ఞం నిర్వహిస్తున్న పండితులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): లోకసంరక్షణ, విశ్వశాంతి కోసం చేపట్టిన అతిరుద్ర మహాయజ్ఞం 9వ రోజు శనివారం కొనసాగింది. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంతులో 110 మంది వేదపండితులు 11 హోమాల్లో యజ్ఞం నిర్వహించారు. మహాగణపతిపూజతో మొదలుపెట్టి లింగార్చనం, అభిషేకాలు, విష్ణుసాహస్ర నామం, గాయత్రి, అన్నపూర్ణ, లక్ష్మీ, సర్వదేవతార్చనతో కొనసాగించారు. సాయంత్రం రక్షిత,రాంజీ బృందం సంగీత గాన కచేరిని నిర్వహించారు.

త్వరలోనే వర్గీకరణ ఫలాలు

- డప్పు ప్రదర్శన ప్రపంచానికి చాటాలి
- కమిషన్ నివేదిక పట్ల అప్రమత్తంగా ఉండాలి
- కార్యవర్గ సమావేశంలో మందకృష్ణ మాదిగ



7



ఈస్ట్ నరసాపురం సమీపాన ఎండిపోయిన చీనీ చెట్టు

వామ్మో.. విల్ట్..

రైతులు లక్షల రూపాయలు వెచ్చించి, కంటికి రెప్పలా కాపాడుకున్న చీనీ చెట్లు నిలువునా ఎండిపోతున్నాయి. విల్ట్ తెగులు సోకి ఉన్నఫలంగా కాపునకు వచ్చిన చెట్లు ఎండిపోయి, మోడుగా మారిపోతున్నాయి. బిడ్డల్లా పెంచుకున్న చెట్ల దుస్థితిని చూసి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. శింగనమల మండలంలో చీనీ విస్తారంగా సాగు చేశారు. కాపునకు వచ్చిన చెట్లను విల్ట్ తెగులు ఆశిస్తున్నాయి. దీంతో చెట్టు నిలువునా ఎండిపోతోంది. రైతులు.. ఉద్యాన శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. విల్ట్ తెగులు అంటూ కొన్ని రకాల మందులను పిచికారీ చేయాలని సూచిస్తున్నారు. వాటిని పిచికారీ చేసినా ప్రయోజనం లేదు. ఒక్కో తోటలో 40 నుంచి 50 చీనీచెట్లు ఎండిపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. అన్ని చెట్లకు విల్ట్ తెలుగు వస్తే పరిస్థితి ఏంటని భయపడిపోతున్నారు. ఇప్పటికైనా ఉద్యానశాఖాధికారులు.. విల్ట్ తెగులు నివారణకు రైతులకు సరైన పరిష్కార మార్గాలు తెలపాలని కోరుతున్నారు. లేదంటే సర్వం నష్టపోతామని అన్నదాతలు వాపోతున్నారు. -శింగనమల, ఆంధ్రజ్యోతి



ఆకలి రాజ్యం పడమటి సూరీడు పండుగా మారగా.. కొమ్మ తుమ్మెదై వాలి కొరుక్కు తింటోంది..!

(కూడేరు మండలం ఉదిరిపికొండ వద్ద)
- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

నేడు యథాతథంగా గ్రూప్-2 పరీక్షలు

తప్పుడు ప్రచారం నమ్మొద్దు

అభ్యర్థులు నిబంధనలు పాటించాలి

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ద్వారా నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షల విషయంలో ఎలాంటి వదంతులు నమ్మవద్దని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. గ్రూప్-2 పరీక్షల విషయంలో వాయిదా వేసినట్లు శనివారం ప్రచారం సాగింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఓ ప్రకటనలో అధికారికంగా స్పష్టత ఇచ్చారు. ముందుగా నిర్ణయించిన మేరకు గ్రూప్-2 పరీక్షలు 23వ తేదీ (ఆదివారం) యథాతథంగా జరుగుతాయని పేర్కొన్నారు. గ్రూప్-2 పరీక్షలు వాయిదా అంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని అభ్యర్థులకు సూచించారు. ఏపీపీఎస్సీ నుంచి అందిన సమాచారం మేరకు షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు. జిల్లాలో మొత్తం 14 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12-30 గంటల వరకు పేపర్-1 పరీక్ష, మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5-30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు ఉంటాయని తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని అన్నారు. పరీక్షలు రాసే అభ్యర్థులు విధిగా నిబంధనలు పాటించాలన్నారు. పరీక్షా కేంద్రానికి అరగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఓ ఐడెంటీ కార్డు తీసుకు రావాలన్నారు. మరోవైపు పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ పర్యవేక్షించారు.

నేడు ఎక్సైజ్ అధికారుల సంఘం ఎన్నికలు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ అధికారుల సంఘం కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జరగనున్నాయి. అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ సారి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని సంఘం నాయకులు నిర్ణయించినట్లు సమాచారం.

10 టన్నుల టమోటా కొనుగోలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో 10 టన్నుల టమోటా కొనుగోలు చేశారు. శనివారం కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ ఆధ్వర్యంలో కిలో రూ.8తో పది టన్నులు కొనుగోలు చేసి విజయవాడకు పంపించారు.

చీనీ కాయలు టన్ను రూ.20వేలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.20,700, కనిష్ఠంగా రూ.3,100, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 110 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

28న ఉమర్ అలీషా జయంతి వేడుకలు

హాజరు కానున్న 9వ పీఠాధిపతి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పిఠాపురం విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం 6వ పీఠాధిపతి కవిశేఖర డాక్టర్ ఉమర్ అలీషా 140వ జయంతిని పురస్కరించుకుని ఈనెల 28న లలితకళా పరిషత్‌లో రాష్ట్రస్థాయి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమర్ అలీషా సాహితీ సమితి జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజుద్దీన్ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రతియేటా పిఠాపురం, భీమవరం, బెంగుళూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి వేడుకలను ఈసారి అనంతపురం జిల్లాలో నిర్వహించేలా తీర్మానించినట్లు తెలిపారు. వేడుకలకు పీఠం 9వ పీఠాధిపతి ఉమర్ అలీషా విశిష్ట అతిథిగా హాజరవడంతోపాటు 'భారతదేశం - మతసామరస్యం' అనే అంశంపై నిర్వహించే సదస్సులో ప్రసంగిస్తారని పేర్కొన్నారు.

ప్రముఖ పుణ్యక్షేత్రం

గూగూడులో సమస్యల తిష్ట

సౌకర్యాలు మృగ్యం

అభివృద్ధి ఊసేలేదు..

కలగా మారిన పర్యాటక కేంద్రం

హామీలకే పరిమితమైన ప్రజాప్రతినిధులు



ఎస్సీ కాలనీలో డ్రైనేజీ లేక రోడ్డుపై మురుగు నీరు

నార్పల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూగూడు గ్రామానికి రాయలసీమలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. గ్రామంలో వెలసిన కుళ్లాయిస్వామి దర్శనానికి రాష్ట్రం నుంచే పక్కనున్న కర్ణాటక నుంచీ సైతం భక్తులు వస్తారు. బ్రహ్మోత్సవాలకు వేలల్లో తరలివస్తారు. ప్రత్యేక బస్సులు సైతం ఏర్పాటు చేస్తారు. అంతటి ప్రసిద్ధి చెందిన గూగూడులో కనీసం మురుగు కాలువ లేదు. గ్రామస్థులు మురుగు నీటిని రోడ్లపైకి వదులుతున్నారు. ఆ నీరు ఆలయం వద్దకు చేరుతోంది. స్వామి దర్శనానికి వచ్చే భక్తాదులు ఆ మురుగు నీటిని తొక్కుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. గ్రామ వీధులు చాలా ఇరుకుగా ఉన్నాయి. వేలాదిగా భక్తులు వస్తే.. తోసుకుంటూ వెళ్లాల్సిందే. పలుమార్లు తొక్కిసలాటలు కూడా జరిగాయి. ఏటా బ్రహ్మోత్సవాల సమయంలో గూగూడు అభివృద్ధికి ప్రజాప్రతినిధులు హామీలు గుప్పిస్తూనే ఉంటారు. ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదు. పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని చెబుతుంటారు. తర్వాత విస్మరిస్తుంటారు. ఆలయానికి కూడా భారీగా ఆదాయం ఉన్నా.. అభివృద్ధికి ఖర్చు చేయకపోవడం పట్ల గ్రామస్థులు, భక్తులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గూగూడు కుళ్లాయిస్వామి క్షేత్రం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. కుళ్లాయిస్వామి, ఆంజనేయ స్వామి జంట ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు వస్తుంటారు. అభివృద్ధి మాత్రం మచ్చుకైనా లేదు. ఏటా బ్రహ్మోత్సవాల్లో కుళ్లాయిస్వామిని ప్రజాప్రతినిధులు దర్శించుకుని, గూగూడును పర్యాటక కేంద్రం చేస్తామని హామీలు ఇస్తున్నారు. అవి మాటలకే పరిమితమవుతున్నాయి. ఎన్నోసార్లు గ్రామ ప్రజలు, భక్తాదులు అర్జీల రూపంలో కలెక్టర్లు, మంత్రులకు గూగూడును అభివృద్ధి చేయాలంటూ విన్నవించుకున్నారు. ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపానపోలేదు. దీంతో గూగూడు అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిపోయింది. గ్రామంలో ఎన్నో సమస్యలు ఉన్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

భక్తులకు సౌకర్యాలు కరువు

గూగూడు కుళ్లాయిస్వామి దర్శనం కోసం వచ్చే భక్తులు స్నానాలు చేసుకోవడానికి కూడా వసతుల్లేవు. స్నానాల బావిలో చుక్క నీరు ఉండదు. భక్తాదులు నిద్ర చేయడానికి వస్తే సత్రాలు దుమ్ము, ధూళితో నిండి ఉంటాయి. ప్రతి గురువారం కుళ్లాయిస్వామి దర్శనానికి పెద్దసంఖ్యలో భక్తులు వస్తుంటారు. క్యూలైన్లు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. బ్రహ్మోత్సవాల్లో అధిక సంఖ్యలో వచ్చే మహిళా భక్తులకు స్నానాలు చేయడానికి బాత్‌రూంలు లేక నానా ఇబ్బందులు పడుతుంటారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో తడికల బాత్‌రూంలు ఏర్పాటు చేస్తారు. అవి ఒక్కరోజులోనే కిందపడిపోతాయి. ఆలయం ముందు క్యూలైన్లు లేక తొక్కిసలాటలు జరిగిన సందర్భాలు కోకొల్లలు. గూగూడు గ్రామ పొలిమేర నుంచి స్వామిని దర్శించుకోవాలంటే ఇరుకు వీధుల్లో తోసుకుంటూ వెళ్లాల్సిందే. కనీసం తాగునీరు కూడా దొరకదు.



గూగూడులో భక్తులు స్నానాలు ఆచరించే బావి ఇదే



గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి జంట ఆలయాలు

గ్రామంలో అన్నీ సమస్యలే..

గూగూడు గ్రామంలో మురుగు కాలువలు కూడా లేవు. రోడ్లపైనే నీరు పారుతూ అపరిశుభ్రంగా మారాయి. గ్రామస్థులు రోడ్లపై నీటిని వదలడంతో అది కుళ్లాయిస్వామి ఆలయం వద్దకు చేరుతోంది. నిష్ఠతో వచ్చే భక్తులు.. మురుగు నీటిని తొక్కుతూ స్వామిని దర్శించుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. గ్రామంలో కనీసం వీధి లైట్లు కూడా లేవు. తాగునీరు కూడా దొరకదు. పంచాయితీ బోర్లలో నీరు అడుగంటిపోయింది. వచ్చే అరకొర నీటిని గ్రామం మొత్తం వాడుకుంటున్నారు. ఇన్ని సమస్యలు ఉన్నా.. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు.

కోటీశ్వరుడు కుళ్లాయిస్వామి

గూగూడు జంట ఆలయాలు దేవదాయ శాఖ పరిధిలో ఉన్నాయి. స్వామికి భక్తులు సమర్పించిన డబ్బు, నగలు, వెండి గురించి తెలిస్తే నోరెళ్లబెడతారు. కుళ్లాయిస్వామికి భక్తులు సమర్పించిన డబ్బు రూ.5కోట్లు, ఒకటిన్నర టన్ను వెండి, రెండున్నర కిలోల బంగారం ఉన్నట్లు దేవదాయ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇంత డబ్బు, నగలు ఉన్నా.. ఆలయం, గూగూడు గ్రామ అభివృద్ధిని ఎందుకు పట్టించుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని, ఆలయంతోపాటు గ్రామాభివృద్ధికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అన్నీ మోసపూరిత హామీలే



గూగూడు గ్రామస్థులకే కాదు, కుళ్లాయి స్వామికి కూడా అధికారులు, పాలకులు మోసపు హామీలు ఇస్తున్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనలో పాలకులు, అధికారులు విఫలమయ్యారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తామని, పర్యాటక కేంద్రంగా గూగూడు గ్రామాన్ని మారుస్తామని పాలకులు హామీ ఇచ్చారు. అది ఎండమావిగానే మిగిలిపోతోంది. - తలారి రాజశేఖర్

దళితవాడలో అధ్వానంగా పారిశుధ్యం



దళిత వాడలో పారిశుధ్యం అధ్వానంగా ఉం ది. పరిసరాలను సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో దోమలు వృద్ధి విప రీతంగా ఉంది. దీంతో రోగాల బారిన ప డుతున్నాం. కాలువలు లేకపోవడంతో ము రుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. అ ధికారులు స్పందించి డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలి.

-అంకన్న

ప్రతిపాదనలు పంపాం



గూగూడు అభివృద్ధి కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. ప్రస్తుతం ఆలయం శిథిలావస్థకు చేరడం వల్ల కొత్త ఆలయం నిర్మించడానికి నిధులు మంజూరయ్యాయి త్వరలోనే చేపడతాం. అలాగే భక్తులకు ఇబ్బందులు లేకుండా కొన్ని ప్రతిపాదనలు చేశాం. వాటిని కూడా త్వరలోనే అమలు చేస్తాం.

- శోభ, ఆలయ ఈఓ

ఇంకా అదే విధానమా..?

డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరులో

పాత పద్ధతి

రైతులపై జీఎస్టీ అదనపు భారం

కొనేందుకు నిరాసక్తత.. టార్గెట్ కుదింపు



పంట పొలంలో అమర్చిన డ్రిప్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరులో వైసీపీ ప్రభుత్వం అమ లు చేసిన పాత సబ్సిడీ విధానాన్నే అమలు చేస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు జీఎస్టీ అదనపు భారంగా మారింది. ఈ పరిస్థితుల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాల కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నప్పటికీ డీడీలు కట్టేందుకు ఎక్కువ శాతం మంది రైతులు వెనుకంజ వేస్తున్నారు. జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పర్యటనలకు వెళ్లిన సమయంలో స్థానిక రైతులు డ్రిప్, స్ప్రింక్లర్లకు సబ్సిడీని పెంచాలని కోరుతున్నారు.

టార్గెట్ కుదింపు..!

2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం జిల్లాకు భారీగానే డ్రిప్, స్ప్రింక్లర్ల టార్గెట్ విధించింది. ఉమ్మడి జిల్లాకు గతంలో అత్యధికంగా 23వేల హెక్టార్ల దాకా లక్ష్యం విధించారు. ఇందులో అనంత జిల్లా 13వేల హెక్టార్లు ఉండింది. ఈ సారి అంతకు రెట్టింపుగా 37500 హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరుకు టార్గెట్ విధించారు. గతేడాది ఆగస్టు నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 38495 మంది రైతులు 51337 హెక్టార్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో 22752 మంది రైతులకు సంబంధించి 27698 హెక్టార్లల్లో ప్రాథమిక పరిశీలన పూర్తి చేశారు. వీరిలో 10316 మంది రైతులు 12233 హెక్టార్లకు నాన్ సబ్సిడీ డబ్బులు చెల్లించారు. ఇందులో 9699 మంది రైతులకు చెందిన 11499 హెక్టార్లకు జిల్లా కలెక్టర్ పరిపాలన అనుమతులు ఇచ్చారు. కాగా 7003 మంది రైతులకు సంబంధించి 8316 హెక్టార్లకు డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు సరఫరా చేశారు. అయితే ఇప్పటి దాకా 4830 మంది రైతులకు చెందిన 5735 హెక్టార్లల్లో పరికరాలు బిగించారు. పాత సబ్సిడీ విధానంతోపాటు జీఎస్టీ అదనపు భారం నేపథ్యంలో డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం డీడీలు కట్టేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఏపీఎంఐపీ రాష్ట్ర ఉన్నతాధికారులు టార్గెట్‌ను 37500 హెక్టార్ల నుంచి 18వేల హెక్టార్లకు తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

జీఎస్టీ అదనపు భారం

పాత సబ్సిడీ విధానంలోనే డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు మంజూరుతోపాటు జీఎస్టీ అదనపు భారంగా మారింది. నాన్ సబ్సిడీపై అదనంగా 6 శాతం జీఎస్టీని విధిస్తున్నారు. దీంతో ఐదెకరాలకు పైగా పొలం ఉన్న రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నా చాలా మంది ఆసక్తి చూపడం లేదు. నాన్ సబ్సిడీ డబ్బులు చెల్లించేందుకు ఎస్టిమేషన్ వేసిన తర్వాత అదనంగా 6 శాతం జీఎస్టీ మొత్తాన్ని చూసి అంత అదనపు మొత్తం చెల్లించలేక అనేక మంది రైతులు డీడీలు కట్టకుండా మిన్నకుండిపోతున్నారు. కరువు జిల్లా రైతులకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

లోకల్ డ్రిప్ పరికరాలు కొనుగోలు చేశా



నాకు రెండున్నర ఎకరాల పొలం ఉంది. కూరగాయల పంటలు సాగు చేస్తున్నాం. గత ప్రభుత్వం హయాంలో డ్రిప్ కోసం దరఖాస్తు చేసుకున్నా. నాన్ సబ్సిడీ డబ్బులతోపాటు అదనంగా జీఎస్టీ కట్టాలని కంపెనీ సిబ్బంది చెప్పారు. అదనంగా డబ్బులు చెల్లించడం ఎందుకని బయట లోకల్ డ్రిప్ పరికరాలు కొనుకొనుగోలు చేసి వాడుకుంటున్నాం. కరువు జిల్లా రైతులకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- చెన్నారెడ్డి, జంబులదిన్నె, గార్లదిన్నె మండలం

తక్కువ సబ్సిడీ, జీఎస్టీతో డ్రిప్ వద్దనుకున్నా..



5.30 ఎకరాల పొలంలో చీనీ పంట సాగు చేస్తున్నా. రైతు సేవా కేంద్రంలో డ్రిప్ కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నా. గత ప్రభుత్వం తరహాలోనే ఐదెకరాలకుపైగా పొలం ఉందన్న కారణంతో 70 శాతం సబ్సిడీ మాత్రమే వర్తిస్తుందని చెప్పారు. అందులోనూ 6 శాతం అదనంగా జీఎస్టీ కట్టాలని ఎస్టిమేషన్ వేశారు. తక్కువ సబ్సిడీతోపాటు అదనంగా జీఎస్టీ చెల్లించలేక డ్రిప్ కోసం డీడీ కట్టలేదు. నాతోపాటు మా ఊర్లో 10 మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం సబ్సిడీని పెంచి రైతులందరికీ న్యాయం చేయాలి.

- రఘునాథ్‌రెడ్డి, కందుకూరు, అనంతపురం రూరల్ మండలం

లక్ష్యాన్ని తగ్గించారు



2024-25 సంవత్సరానికి డ్రిప్, స్ప్రింక్లర్ల టార్గెట్‌ను రాష్ట్ర ఉన్నతాధికారులు తగ్గించారు. తొలుత జిల్లాకు 37500 హెక్టార్లల్లో డ్రిప్, స్ప్రింక్లర్ల మంజూరు కోసం లక్ష్యం విధించారు. ఇటీవల 18వేల హెక్టార్లకు లక్ష్యాన్ని తగ్గిస్తూ ఉత్త ర్వులు జారీ చేశారు. డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం డీడీలు చెల్లించిన రైతులకు జిల్లా కలెక్టర్ మంజూరు ఉత్తర్వుల మేరకు సకాలంలో పరికరాలు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటాం. సబ్సిడీ పెంపు ప్రభుత్వం చేతుల్లోనే ఉంది.

- రఘునాథరెడ్డి, పీడీ, ఏపీఎంఐపీ

పారిశ్రామికవేత్తలుగా డ్వాక్రా మహిళలు

జీవనోపాధుల పెంపునకు ప్రణాళికలు

స్వయం సహాయక సంఘాలకు ఇతోధికంగా రుణాలు

డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య



పథకాలపై సమీక్షిస్తున్న డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలను పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని, ఆ దిశగా వారిని ప్రోత్సహించాలని డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఈశ్వరయ్య పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా తీసుకువచ్చిన స్వయం ఉపాధి పథకాలపై శనివారం తన చాంబర్‌లో శాఖ అధికారులతో పీడీ సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక మహిళా సంఘాల (డ్వాక్రా)కు ప్రవేశపెట్టిన జీవనోపాధుల పెంపు పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాల్లో ఉన్న పేద, మధ్యతరగతి కుటుంబాల్లో కనీసం రెండు వేల మందిని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడమే లక్ష్యం అన్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక ఔత్సాహిక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే సీఎం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ప్రధానంగా ఎస్టీ కార్పొరేషన్ నిధులతో ఆ వర్గ మహిళలకు పెరటికోళ్ల పెంపకం అమలు చేస్తున్నామని, 31 మండలాల్లో 869 మందిని గుర్తించి రూ.47.16 లక్షలు చెల్లించామని అన్నారు. ప్రధానమంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన పథకం ద్వారా ఎస్సీ డ్వాక్రా మహిళలకు రూ.50వేల సబ్సిడీ పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 31 మండలాల నుంచి 68 మందిని గుర్తించామని, వీరికి రూ.1.06 కోట్లు నిధులు మంజూరు చేశామని అన్నారు. ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా లబ్ధిదారులకు త్వరలో చెక్కులు పంపిణీ చేస్తామన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద డ్వాక్రా మహిళలకు స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా హోంకంపోస్టింగ్, కిచెన్ గార్డెన్‌ల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 12,569 మందిని గుర్తించామన్నారు. జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (ఎన్‌ఆర్‌ఎల్‌ఎం) కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణాభివృద్ధిశాఖ (సెర్ప్) ద్వారా స్వీప్ ప్రాజెక్ట్‌ను శింగనమల నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. నాలుగేళ్లపాటు ఈ పథకం అమలు చేస్తామన్నారు. ఏడాదికి ఒక్కో మండలంలో 25 మంది చొప్పున 150 మందిని, నాలుగేళ్లలో 600 మందికి పైగా డ్వాక్రా మహిళలను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తయారు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఈ పథకాలను జిల్లా వ్యాప్తంగా ఉన్న డ్వాక్రా సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకుని, జీవనోపాధుల పెంపుతో పేదరికం నుంచి విముక్తి పొందేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎంలు గంగాధర్, సత్యనారాయణ, రవీంద్రబాబు, ఏపీఎంలు భాస్కర్‌నాయుడు, మంజుల పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఈతకెళ్లి విద్యార్థి మృతి

● మృతదేహాన్ని రాత్రి వెలికి తీసిన గజ ఈతగాళ్లు


వీరాచారి(ఫైల్)

గుత్తి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బావిలో ఈతకెళ్లి పదో తరగతి విద్యార్థి మృతి చెందాడు. స్థానిక కోట వీధిలోని రాజాబావిలో ఈతకెళ్లిన వీరాచారి (15) అనే పదో తరగతి విద్యార్థి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని ఆచారి కాలనీకి చెందిన గోపాలచారి, రాజమ్మ దంపతుల కుమారుడు వీరాచారి కోట వీధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శనివారం మధ్యాహ్నం కోటలోని లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం వద్ద అన్నదాన కార్యక్రమానికి వెళ్లి పాఠశాలకు వచ్చాడు. తోటి స్నేహితులతో కలసి రాజా బావి వద్దకు వెళ్లారు. సరదాగా బావిలో దిగుదామని మిత్రులతో అన్నాడు. ఈత రాదని వారెవరూ ముందుకు రాలేదు. కొద్దిగా ఈత తెలిసిన వీరాచారి బట్టలు విప్పి గట్టుమీద పెట్టి బావిలోకి దూకాడు. ఎంతసేపటికి పైకి రాకపోవడంతో తోటి విద్యార్థులు పాఠశాల వద్దకు వెళ్లి విషయాన్ని ఉపాధ్యాయులకు తెలిపారు. బావి వద్దకు చేరుకున్న ఉపాధ్యాయులు పోలీసులకు సమాచారం అందించి స్థానిక ఈత గాళ్లతో గాలించారు. విద్యార్థి ఆచూకి లభించకపోవడంతో గుంతకల్లు ఫైర్‌సిబ్బంది, గజ ఈతగాళ్లతో గాలించారు. రాత్రి 7గంటలకు లైట్లు వేసి కొనసాగించారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ సురేష్, మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా, ఎంఈఓ రవినాయక్‌తో పాటు సంబంధిత అధికారులు అక్కడే ఉండి పర్యవేక్షించారు. ఎట్టకేలకు వీరాచారి మృతదేహాన్ని గజ ఈతగాళ్లు రాత్రి వెలికితీశారు. దీంతో కుటుంబసభ్యులు మృతదేహం మీద పడి బోరున విలపించారు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు, బాలుడి సోదరి మృతదేహంపడి బోరున విలపించారు.

అంతర్ జిల్లా దొంగ అరెస్టు

● బంగారం స్వాధీనం.. వాహనాలు సీజ్

రాప్తాడు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అనంతపురం, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాలలో దొంగతనాలకు పాల్పడిన మహమ్మద్ రఫి అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి 12 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని సీఐ శ్రీహర్ష శనివారం తెలిపారు. కడప జిల్లా దువ్వూరు మండలం జిల్లాల గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీ.. మొత్తం 8 దొంగతనం కేసుల్లో ప్రధాన ముద్దాయి అని సీఐ తెలిపారు. నాలుగు జిల్లాలో చోరీ చేసిన సుమారు 47 తులాల బంగారాన్ని బెంగళూరులోని అట్టికా గోల్డ్ కంపెనీలో అమ్మేశాడు. వచ్చిన డబ్బుతో కారు, బుల్లెట్, స్కూటీ కొనుగోలు చేశాడు. వాటిని సీజ్ చేశామని సీఐ తెలిపారు. బెంగళూరులో గోల్డ్ కంపెనీకి అమ్మిన 47 తులాల బంగారాన్ని రికవరీ చేసేందుకు ఆ కంపెనీకి నోటీసులు జారీ చేశామని తెలిపారు. నిందితుడిపై కడప, కర్నూలు, నంద్యాల జిల్లాలలోని పోలీస్‌స్టేషన్‌లలో పాత చోరీ కేసులు కూడా ఉన్నాయని సీఐ తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం.. కేసు నమోదు

కల్లూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని అదృశ్యంపై శనివారం కల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కల్లూరు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు వివరాలు... అనంతపురం జిల్లాకు చెందిన తనూజ (19) ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతోందన్నారు. ఈనెల 13వ తేదీన కళాశాల నుండి విద్యార్థిని తన తండ్రితో ఫోన్‌లో మాట్లాడిందన్నారు. అదే రోజు సాయంత్రం ఆమె ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో ఆమె తండ్రి కళాశాలకు వచ్చి విచారించగా అక్కడ కనిపించలేదు. దీంతో చుట్టుప్రక్కల గ్రామాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో అదృశ్యమైనట్లు గుర్తించి ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కల్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

లొంగిపోయిన బూసుపల్లి

● గోవా లిక్కర్ కేసు ప్రధాన నిందితుడు
● పోలీసుల కళ్లుగప్పి.. కోర్టులో సరెండర్
● కస్టడీ పిటిషన్ వేసిన ఎక్సైజ్ పోలీసులు


కోర్టులో లొంగిపోయిన బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గోవా మద్యం అక్రమ రవాణా, విక్రయం కేసు ప్రధాన నిందితుడు బూసుపల్లి వెంకటశివకుమార్ రెడ్డి జిల్లా కోర్టులో సరెండర్ అయ్యాడు. రెండు నెలలుగా ఎక్సైజ్ పోలీసులకు దొరక్కుండా తిరిగాడు. తన న్యాయవాది ద్వారా బెయిల్ కోసం రెండుసార్లు హైకోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. దీనిపై హైకోర్టు సీరియస్ అయినట్లు తెలిసింది. బెయిల్ ప్రయత్నాలు బెడిసికొట్టడంతో నాలుగు రోజుల క్రితం అత్యంత రహస్యంగా సరెండర్ అయ్యాడు. జిల్లా కోర్టు రెఫర్ చేయడంతో ఎక్సైజ్ కోర్టు నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించింది. రాజకీయ ప్రమేయం ఉండటంతో నిందితుడి లొంగుబాటు గురించి ఎక్సైజ్ శాఖ గోప్యత పాటించిందని సమాచారం.

కస్టడీ పిటిషన్: గోవా అక్రమ మద్యం కేసులో విచారణ కోసం ప్రధాన నిందితుడిని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ ఎక్సైజ్ అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ విషయాన్ని అనంతపురం ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ ధ్రువీకరించారు. త్వరలోనే కోర్టు కస్టడీకి ఇవ్వొచ్చని ఆయన అన్నారు. ఏఏ కోణాలలో విచారించాలనే విషయమై ఉన్నతాధికారుల నుంచి ఇప్పటికే సూచనలు వచ్చినట్లు తెలిసింది. గత ఏడాది డిసెంబరు 9న రాప్తాడు రైల్వే గేటు సమీపంలోని ఓ తోటలో రూ.44 లక్షల విలువైన 474 బాక్సుల గోవా మద్యాన్ని అనంతపురం ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేశారు. అదే రోజున ఐదుగురు నిందితులను, ఆ తర్వాత మరో ముగ్గురిని అరెస్టు చేశారు. వీరందరూ ఇప్పటికే బెయిల్‌పై బయటకు వచ్చారు. ప్రధాన నిందితుడు బూసుపల్లి వెంకటశివకుమార్‌రెడ్డి మాత్రం పరారీలో ఉండిపోయాడు. రెండు మాసాలుగా ఎక్సైజ్ పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి నెల్లూరు, హైదరాబాద్, కర్ణాటక, అనంతపురం సమీప ప్రాంతాల్లో గాలించారు. సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని, దొరక్కుండా తప్పించుకున్నాడు. సివిల్ పోలీసుల సాంకేతిక సాయం తీసుకున్నా ఫలితం లేకపోయింది. కొందరు రాజకీయ నాయకుల సాయంతో పట్టుబడకుండా తప్పించుకున్నాడని ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో కస్టడీలో ఏమాత్రం విచారిస్తారోనన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి.




పోరు దండోరా పుస్తకావిష్కరణ చేస్తున్న మందకృష్ణ, నాయకులు

త్వరలోనే వర్గీకరణ ఫలాలు

● డప్పు ప్రదర్శన ప్రపంచానికి చాటాలి
● కమిషన్ నివేదిక పట్ల అప్రమత్తంగా ఉండాలి
● ప్రజాప్రతినిధులు, ఉద్యోగులతో చర్చించాలి
● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం సాగించిన మూడు దశాబ్దాల పోరాట ఫలాలను త్వరలోనే అందుకోబోతున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియపై శనివారం రాష్ట్రస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. నగరంలో ఏర్పాటు చేసిన సమావేశానికి వివిధ జిల్లాల నుంచి ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల ప్రతినిధులు తరలివచ్చారు. ముఖ్య అతిథులుగా హాజరైన మందక్రిష్ణ మాదిగ, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజును గజమాలతో సత్కరించారు. అనంతరం మందక్రిష్ణ మాట్లాడుతూ.. వర్గీకరణ సాధనలో మాదిగల సాంప్రదాయ వాయిద్యమైన డప్పు ప్రధాన ప్రాత్ర పోషించిందన్నారు. కమిషన్ నివేదక ప్రక్రియకు తెలంగాణ ప్రభుత్వం జాప్యాన్ని ప్రదర్శించినట్లు పేర్కొన్నారు. లక్ష డప్పులు, వేల గొంతుకల కార్యక్రమానికి పిలుపునివ్వడంతో దిగివచ్చిన సర్కార్ వేగవంతం చేయడం ఇందుకు నిదర్శనం అన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అమరులైన కార్యకర్తల త్యాగాలను స్మరించుకునేందుకు మార్చి 1 మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. నెలల తరబడి జిల్లావారిగా సదస్సులు నిర్వహించి అభిప్రాయాలను, వినతులను స్వీకరించిన కమిషన్ నివేదిక సమర్పణ చివరి అంకానికి చేరుకున్నారు. ఈ సమయంలో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరముందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మాదిగ సామాజిక ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులతో చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చొరవతో ముప్పై ఏళ్ల పోరాటం సాకారం కాబోతోందని హర్షాన్ని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ.. మాదిగలకు మందక్రిష్ణ ఆత్మస్థైర్యమని తెలిపారు. నమ్ముకున్న సిద్ధాంతాన్ని సాధించేందుకు మూడు దశాబ్దాల సుదీర్ఘ పోరాటం చేసిన నాయకత్వం మందక్రిష్ణకే దక్కిందన్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు సురేష్, ఎమ్మెస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథ్, ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బిక్షాలు, జాతీయ నాయకులు సురేంద్రబాబు, నాయకులు శంకర్, గంగాధర్, హరిగోపాల్, కదిరప్ప, రమేష్, ఆంజనేయులు, నాగేంద్ర, మధుసూదన్ పాల్గొన్నారు.


నిసార్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న మందకృష్ణ

నిసార్ సేవలు చిరస్మరణీయం

ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ ఉద్యమాల్లో నిరంతరం పనిచేసిన నిసార్ సేవలు చిరస్మరణీయమని మందకృష్ణ మాదిగ కొనియాడారు. ఎర్రనేల కొట్టాలలోని నిషార్ ఇంటికెళ్లి అతడి భార్య, కుమారుడు, కూతురిని మందక్రిష్ణ పరామర్శించారు. ఇద్దరు పిల్లలకు చదువు, ఉద్యోగం బాధ్యతలను తీసుకుని ప్రయోజకులుగా తీర్చిదుద్దుతామని హామీ ఇచ్చారు. బీసీఆర్ దాస్‌తో కలిసి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, సూరి, నరసింహులు, నాగమ్మ, శాంతి, పద్మావతి పాల్గొన్నారు.


పాల్గొన్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల ప్రతినిధులు

ప్రాణాలతో.. చెలగాటం..!

● పెద్దాసుపత్రికి క్రిటికల్ కేర్ యూనిట్
● సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో నిర్మాణం
● ఆస్పత్రికి చేరిన పరికరాలు, ఫర్నిచర్


సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆవరణలో నత్తనడకన సాగుతున్న క్రిటికల్ కేర్ సెంటర్ పనులు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలకుల అనాలోచిత నిర్ణయం.. జిల్లా ప్రజలకు ప్రాణసంకటంగా మారింది. ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఉద్దేశించిన క్రిటికల్ కేర్ సెంటర్‌ను అనువుగాని చోట ఏర్పాటు చేస్తున్నారు. ఈ సెంటర్‌ను జిల్లా సర్వజనాస్పత్రికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తే.. ఊరికి దూరంగా ఉన్న సూపర్ స్పెషాలిటీలో నిర్మిస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా సర్వజనాస్పత్రికి నిత్యం వేలాది మంది రోగులు వస్తుంటారు. వందలాది మంది ప్రాణాపాయ పరిస్థితుల్లో అడ్మిట్ అవుతుంటారు. సీరియస్ కేసులకు చికిత్స అందించడానికి అత్యవసర విభాగాల్లో సౌకర్యాలు లేవు. దీంతో క్యాజువాలిటీ ఐసీయూల్లో సీరియస్ కేసులకు సకాలంలో వైద్యం అందక చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఆస్పత్రికి రూ.23 కోట్లతో క్రిటికల్ కేర్ సెంటర్‌ను కేంద్రం మంజూరు చేసింది. 50 పడకలతో అవసరమైన వసతుల కల్పనకు ఆదేశాలిచ్చారు.

ఇదెలా..?

జిల్లా ఆస్పత్రిలో అత్యవసర రోగులకు సేవలందించాలని క్రిటికల్ కేర్ సెంటర్‌కు కేంద్ర ప్రభుత్వం పీఎం ఏబీహెచ్ఐఎం కింద రూ23.75 కోట్లు మంజూరు చేసింది. భవన నిర్మాణానికి రూ.16.63 కోట్లు, పరికరాలకు రూ7.12కోట్లు కేటాయించారు. మొత్తం నాలుగు ఫ్లోర్లలో భవన నిర్మాణానికి ప్లాన్ చేశారు. 2024 జనవరిలో పనులను అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ప్రజాప్రతినిధులు హడావుడిగా ప్రారంభించారు. ఆ సమయంలో జిల్లా ఆస్పత్రిలో నిర్మించాల్సిన ఈ క్రిటికల్ కేర్ సెంటర్‌ను నగరానికి దూరంగా ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ నిర్ణయం ఎందుకు తీసుకున్నారో అర్థంకాని పరిస్థితి. 2025 మార్చిలోగా పనులు పూర్తి కావాల్సి ఉన్నా.. నేటికీ స్లాబ్‌లకే పరిమితమైంది. ఇంకో ఏడాదికైనా పనులు పూర్తవుతాయా, లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఇబ్బందికరం..

జిల్లా ఆస్పత్రికి రేయింబవళ్లు పదుల సంఖ్యలో సీరియస్ కేసులు వస్తున్నాయి. ఇక్కడ క్యాజువాలిటీ, ఐసీయూ విభాగాల్లో తక్కువ పడకలు ఉండడంతో ఆ సీరియస్ కేసులకు బెడ్లు దొరకడం లేదు. దీంతో బయటే ఉండాల్సి వస్తోంది. ఆ సమయంలో వైద్యం అందక ప్రాణాలు పోతున్నాయి. అలాంటపుడు ఆస్పత్రిలో క్రిటికల్ కేర్ సెంటర్ 50 పడకలతో ఏర్పాటు చేసి ఉండుంటే ఇలాంటి సీరియస్ కేసులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేది. సూపర్ స్పెషాలిటీలో ఏర్పాటు చేయడం వల్ల ఆస్పత్రికి వచ్చిన ఈ సీరియస్ కేసులను పరీక్షించి అనంతరం క్రిటికల్ కేర్ సెంటర్‌కు రెఫర్ చేయాల్సి ఉంటుంది. ఇక్కడ ఆస్పత్రి నుంచి సీరియస్ కేసులను అక్కడికి తరలించడానికి ఎలాంటి ప్రత్యేక వాహనాలూ లేవు. అలాంటపుడు సీరియస్ కేసులను దాదాపు 10 కి.మీ. దూరంలో ఉన్న సూపర్ స్పెషాలిటీకి ఎలా తీసుకెళ్తారో అర్థంకాని ప్రశ్నగా మారింది. దీంతో క్రిటికల్ కేర్ సెంటర్‌ను సూపర్ స్పెషాలిటీలో ఏర్పాటు చేయడం పట్ల అటు వైద్యవర్గాలు, ఇటు ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆస్పత్రికి ప్రత్యేక వైద్యులు, సిబ్బందిని ప్రభుత్వం నియమించాల్సి ఉంది. ఆ దిశగా అడుగు ముందుకు పడలేదు. దీంతో క్రిటికల్ కేర్ సెంటర్ నిర్మాణంపై అయోమయం నెలకొంది.

ఫర్నిచర్, పరికరాలు వచ్చేశాయ్..

క్రిటికల్ కేర్ సెంటర్ నిర్మాణమే పూర్తి కాలేదు కానీ, అప్పుడే అందుకు సంబంధించిన పరికరాలు, ఫర్నీచర్ జిల్లాకు చేరుతున్నాయి. ఇప్పటికే ఓటీ, ఎల్‌డీఆర్ టేబుళ్లు, ఎలక్ట్రో సర్జికల్ యూనిట్, రేడియంట్ వార్మర్, అల్ట్రాసౌండ్ సిస్టమ్, ఐసీయూ కాట్స్ జిల్లాకు చేరాయి. వీటిని జిల్లా ఆస్పత్రిలోని ఓ రూమ్‌లో భద్రపరిచినట్లు వైద్యవర్గాలు చెబుతున్నాయి. భవన నిర్మాణం ఆలస్యమైతే అప్పటి వరకు ఈ పరికరాలు భద్రంగా ఉంటాయో, లేవోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



స్థల సమస్యతోనే..

క్రిటికల్ కేర్ యూనిట్‌ను జిల్లా ఆస్పత్రికే కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ సెంటర్ నిర్మాణానికి అవసరమైన స్థలం ఆస్పత్రిలో లేదని ఇంజనీర్లు సూపర్ స్పెషాలిటీలో చూపించి, అక్కడకు మార్చారు. దాంతో మాకు సంబంధం లేదు. డాక్టర్లు, సిబ్బందిని ప్రత్యేకంగా నియమించాల్సి ఉంది. ఇప్పటికేఈ కేర్ యూనిట్‌కు సంబంధించిన కొన్ని పరికరాలు, ఫర్నీచర్ వచ్చాయి. దీనిపై ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి నివేదించాం. కేర్ సెంటర్ నిర్మాణం పూర్తి చేసి, మాకు అప్పజెబితే అప్పటి నుంచి అక్కడ సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్



మరో ఆరునెలలు పొడిగించారు

క్రిటికల్ కేర్ సెంటర్ నిర్మాణం నత్తనడకన సాగుతున్న విషయం వాస్తవమే. ఇటీవల ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి. నిర్మాణ గడువును మరో ఆరు నెలలు పొడిగిస్తూ కాంట్రాక్టర్‌కు ఉత్తర్వులు ఇచ్చారు. పనులు వేగం పుంజుకుంటాయి. గడువులోగా పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాసులు నాయుడు, ఈఈ, ఏపీఎంఎస్ఐడీసీ

సీమకు ప్రత్యేక నిధులు కేటాయించాలి

● విద్యావంతుల వేదిక డిమాండ్


ఏఓ గిరిధర్‌కు వినతి పత్రం ఇస్తున్న రాయలసీమ విద్యావంతుల వేదిక సభ్యులు

పెనుకొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో రాయలసీమకు ప్రత్యేకంగా 42 శాతం నిధులను కేటాయించాలని రాయలసీమ విద్యావంతుల వేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం రాయలసీమ విద్యావంతుల వేదిక కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఏఓ గిరిధర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో రాయలసీమకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. రాష్ట్రం విడిపోయిన తరువాత విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేయాలని, ప్రభుత్వ సంస్థలను అమరావతికి తరలించడం నిలిపివేయాలని, గుంతకల్ రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని, కడప ఉక్కు పరిశ్రమను ప్రభుత్వమే నిర్వహించాలని, హంద్రీనీవాకు లైనింగ్ పనులు ఆపివేసి కాలువ సామర్థ్యాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, రమేష్, కోగిర జయచంద్ర, డిగ్రీకళాశాల అధ్యాపకులు రామన్న, జాఫర్ పాల్గొన్నారు.

ఇద్దరు పిల్లలతో మహిళ అదృశ్యం

కదిరి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఇద్దరు పిల్లతో మహిళ అదృశ్యమైనట్లు కదిరి పట్టణ సీఐ నారాయణరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని శివాలయం వీధిలో నివాసముంటున్న చిన్నరెడ్డెప్ప భార్య శ్రావణి భర్తపై అలిగి ఇద్దరు కుమారులతో సహా జనవరి 3న ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయిందని అన్నారు. ఇద్దరు కుమారులు వంశీకృష్ణ, దయాకర్‌ను తీసుకుని వెళ్లిందని అన్నారు. గతంలో కూడా శ్రావణి ఇలాగే అలిగి వెళ్లిపోయి, వారం రోజులపాటు తిరుపతిలో ఉండి తిరిగి వచ్చిందని తండ్రి శ్రీరాములు తెలిపారు. ఈసారి కూడా అలాగే వస్తుందని నెల 20 రోజులు ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు. శనివారం తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సమస్యల పరిష్కారానికే డయల్ యువర్ డీపీఓ

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికే డయల్ యువర్ డీపీఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్పీ రత్న పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన డయల్‌యువర్ డీపీఓ కార్యక్రమంలో సిబ్బంది జీతభత్యాలు, సరెండర్ సెలవులు, ఈఎల్ఎస్, మెడికల్ సెలవులు, హెచ్‌ఆర్ఏ, ఇంక్రిమెంట్లు వంటి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో ఏఓ సుజాత, సూపరింటెండెంట్లు సరస్వతి, మల్లికార్జున, సూర్యతేజ పాల్గొన్నారు.

పగలు.. రాత్రి బిజీ బిజీ..!

అంతర్రాష్ట్ర దొంగ కథే వేరు

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బంగారు ఆభరణాలను ఉదయం చోరీలు చేసి.. రాత్రిళ్లు కరిగించి బిస్కెట్‌గా మార్చి విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర దొంగ సుహైల్ ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతన్నుంచి 350 గ్రాముల బంగారం బిస్కెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. పెనుకొండ సర్కిల్ కార్యాలయంలో సీఐ రాఘవన్ ఈ కేసు వివరాలను శనివారం వెల్లడించారు. పెనుకొండ నారాయణమ్మ కాలనీలో ఉపాధ్యాయుల ఇళ్లలో జనవరి 20న సుహైల్ ఖాన్ చొరబడి, 470 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు చోరీ చేశాడని సీఐ తెలిపారు. బెంగళూరుకు చెందిన సుహైల్ చోరీ చేసినట్లు సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించామని, తుమకూరులో శివానగర్‌లో ఈ నెల 13న అరెస్టు చేశామని తెలిపారు. రిమాండ్‌కు తరలించిన అనంతరం కోర్టు అనుమతితో కస్టడీకి తీసుకుని విచారించామని తెలిపారు. నిందితుడు చోరీ చేసిన బంగారాన్ని కరిగించేందుకు ఆన్‌లైన్‌లో పరికరాలను కొనుగోలు చేశాడని అన్నారు. బిస్కెట్ బంగారాన్ని హైదరాబాద్‌లోని ఓ దుకాణంలో విక్రయించాడని తెలిపారు. అక్కడ రికవరీ చేశామని తెలిపారు. బంగారాన్ని కరిగించే యంత్రాలు, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశామని తెలిపారు. మొత్తం 350 గ్రాముల బంగారాన్ని రికవరీ చేశామని, ఇందులో 250 గ్రాములు పెనుకొండలో చోరీ చేసినదని, మిగిలిన సొమ్ము కుప్పంలో రెండు చోట్ల చోరీ చేసినదని తెలిపారు. హైదరాబాద్ బంగారం వ్యాపారి కూడా మోసపోయాడని, బంగారం కొని సుహైల్‌కు రూ.29 లక్షలు ఇచ్చాడని తెలిపారు. కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన సీసీఎస్ ఎస్ఐ రాము, ఎస్ఐలు రాజేష్, వెంకటేశ్వర్లు, అంజినేయులు, కానిస్టేబుల్ ఆదినారాయణ, నాగరాజు, సుధాకర్, దస్తగిరి, రామును ఎస్పీ రత్న అభినందించారని సీఐ తెలిపారు. సుహైల్‌పై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో పలు కేసులున్నాయని, మోస్ట్ వాంటెడ్ క్రిమినల్ అని తెలిపారు.


రికవరీ చేసిన బంగారం, ఆభరణాలను కరిగించే యంత్రాలను చూపుతున్న సీఐ రాఘవన్

న్యూస్ బాక్స్

దేవాలయాల పునర్విభజనపై ఉత్తర్వులు

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు దేవాలయాలను కేటగిరి వారిగా పునర్వర్గీకరణ చేస్తూ దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా మడకశిర మండలం జిల్లేడుకుంట భక్తరహళ్లి ఆంజనేయ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని ఏ కేటగిరి నుంచి బీ కేటగిరికి, ననసకోట ముత్యాలమ్మ దేవాలయాన్ని సీ నుంచి బీ కేటగిరికి, ధర్మవరం పాండురంగస్వామి దేవాలయం, లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం, తాడిమర్రి మండలంలోని కాటకోటేశ్వరస్వామి దేవాలయం, హిందూపురం సుగూరు ఆంజనేయస్వామి దేవాలయం, హిందూపురం పేట వెంకటరమణస్వామి దేవాలయం, గుడ్డం రంగనాథస్వామి దేవాలయం, అనంత పద్మనాభస్వామి దేవాలయం, నానెప్ప చౌల్ట్రీలను బీ నుంచి సీ కేటగిరికి మారుస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

పారాలీగల్ వలంటీర్లకు శిక్షణ


మాట్లాడుతున్న న్యాయాధికారి జయలక్ష్మి

కదిరిలీగల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పారాలీగల్ వలంటీర్లగా నియమితులైన న్యాయవాదులు, ఇతర రంగాల సామాజిక వేత్తలకు మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్, న్యాయాధికారి ఎస్ జయలక్ష్మి స్థానిక కోర్టు ఆవరణంలో శనివారం శిక్షణ తరగతులను నిర్వహించారు. ప్రజలకు చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడానికి కృషి చేయాలని సూచించారు. ఈ సదస్సులో రెడ్స్ బానూజా జన జాగృతి శ్రీనివాసులు, న్యాయవాదులు లోకేశ్వర్‌రెడ్డి, వెంకటేష్, దశరథ్, ఇతర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చెత్త సేకరణ పరిశీలన

నంబులపూలకుంట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో పంచాయతీ సిబ్బంది చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఈఓఆర్డీ మాధవరెడ్డి శనివారం పరిశీలించారు. మండలంలోని 14 పంచాయతీల పరిధిలో 22, 23 తేదీల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. తడిచెత్తను వర్మీకంపోస్టుకు, పొడిచెత్తను ప్రతి గురువారం చెత్త సంపద కేంద్రాలకు విక్రయించి, పంచాయతీకి ఆ సొమ్ము జమ చేస్తామన్నారు. ఈ విషయంలో కార్మికులకు శిక్షణ ఇచ్చి, పంచాయతీకి ఎలా లాభం చేకూర్చాలో వివరించామన్నారు.

చెత్త సంపద కేంద్రాలపై అవగాహన

బుక్కపట్నం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): చెత్త సంపద, పారిశుధ్య పనులపై స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం యానిమేటర్లు, వీఓ సంఘాల లీడర్లకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ.. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, మహిళ సంఘం లీడర్లు పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, ఈఓఆర్‌డీ అశోక్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ధర్మవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం సరస్వతి పూజను విద్యార్థులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కళాశాల ఆవరణంలో షెడ్ నిర్మాణానికి విశ్రాంత కామర్స్ అధ్యాపకులు వసంతకుమారి రూ.3 లక్షలు, బండి లక్ష్మీదేవి రూ.2.50 లక్షల విరాళాన్ని అందజేశారు. దీంతో వారిని కళాశాల అధ్యాపకులు సన్మానించారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఇందులో కళాశాల చైర్మన్ బండి వేణుగోపాల్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ మహాలక్ష్మీ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న రేషన్ డీలర్లు

ముదిగుబ్బ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్ల సమస్యను పరిష్కరించాలని మండలంలోని రేషన్ డీలర్లు తహసీల్దార్ నారాయణస్వామి, సీఎస్‌డీటీ మునిస్వామిని కోరారు. శనివారం టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్ ఆధ్వర్యంలో వినతి పత్రాలుఅందించారు. బఫరింగ్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ

ధర్మవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆదర్శ పాఠశాల విద్యార్థులకు శనివారం కంటిఅద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియాసాల్మాన్, వైద్యాధికారిపీబీ ప్రియాంక, సచివాలయ ఆరోగ్య కార్యకర్త మెహతాజ్, సీఓ మారతీ కుమార్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ధర్మవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోడల్‌స్కూల్‌లో ఆరో తరగతి ప్రవేశానికి వచ్చే నెల 31లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ పద్మశ్రీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశపరీక్ష ఏప్రిల్ 20న ఉంటుందని, ఎస్సీ, ఎస్టీలకు రూ.75, బీసీ, ఓసీలకు రూ.150 పరీక్ష ఫీజు చెల్లించాలని అన్నారు. మరిన్ని వివరాలకు 79811 71568ను సంప్రదించాలన్నారు.

సీబీఆర్‌లోకి చేపల విడుదల

తాడిమర్రి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి శనివారం సాయంత్రం మత్స్యశాఖ ఏడీ చంద్రశేఖర్‌రెడ్డి చేప పిల్లలను వదిలారు. దాదాపు 35 లక్షలు చేపపిల్లలను వదిలి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాము, టీడీపీ నాయకుడు ఏటుకూరి నాయుడు, మరువపల్లి వన్నూర్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ధర్మవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్లస్థలాలు కేటాయించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకట నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక గూడ్‌షెడ్ కొట్టాలలో ఇంటిస్థలాలు లేని వారి నుంచి శనివారం దరఖాస్తులు తీసుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎర్రంశెట్టి రమణ, చేనేత కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు గుర్రం వెంకటస్వామి పాల్గొన్నారు.

మహిమాన్వితం.. కాటకోటేశ్వరక్షేత్రం

25, 26న శివరాత్రి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు


అలంకరణలో కాటకోటేశ్వరుడు


స్వామివారి ఆలయం

తాడిమర్రి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని అత్యంత మహిమలు గల ప్రాంతంగా కాటకోటేశ్వర క్షేత్రం ప్రసిద్ధి చెందింది. ఈ క్షేత్రంలో శివరాత్రి ఉత్సవాలను మంగళ, బుధవారాల్లో ఘనంగా .. ప్రశాంతంగా.. నిర్వహించేందుకు అధికారులు, పోలీసులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కొండపైన అక్కదేవతలు కొలువై ఉన్నారు. నవగ్రహాలు, గదే గుండం ఇక్కడి ప్రత్యేకత. ఇక్కడ నిర్వహించే శివరాత్రి ఉత్సవాలకు చుట్టుపక్కల ప్రాంతాల వారే కాకుండా.. ఇతర జిల్లాలు.. రాష్ట్రాల నుంచీ భక్తులు వస్తారు.

● ఇలా వెళ్లాలి : తాడిమర్రికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ క్షేత్రానికి వెళ్లాలంటే దాడితోట వరకు బస్సులో వెళ్లి అక్కడి నుంచి ఆటోలో వెళ్లాల్సి ఉంటుంది. అనంతపురం మీదుగా వచ్చేవారైతే అనంతపురం డిపో నుంచి ఉదయం, సాయంత్రం ఆర్టీసీ బస్సులు ఉన్నాయి.

● స్థలపురాణం : పార్నపల్లిలోకి ఓ వర్గానికి చెందిన వారి ఇంటి దేవుడు కాటకోటేశ్వరస్వామి. ఈ వర్గానికి చెందిన వారిని ఆ గ్రామంలోకి కాకుండా కోనేటి రాజు అడ్డుకునేవానేవాడు. దీంతో వారు అనేక పోరాటాలు చేసి... ఓడారు. ఆ సమయంలో వారి తరఫున కాటకోటేశ్వరస్వామే వచ్చి.. యుద్ధం చేసి.. ఆ రాజు ఓడించాడు. ఆ గ్రామంలోకి ఆ వర్గం వారు వెళ్లేలా చేశారు. అనంతరం స్వామి గుర్రంపై వెళ్తుండగా.. ఆ శబ్దానికి గుహలో తపస్సు చేసుకుంటున్న మునులకు భంగం కలించింది. దీంతో వారు ఆగ్రహించి.. శిలలా మారిపోవాలని శపించారు. దీంతో స్వామి వారు అక్కడే శిలా మారిపోయారు. దీంతో విగ్రహానికి అక్కడే ఆలయం నిర్మించి పూజలు చేస్తున్నారు. ఎవరైనా శుచి.. శుభ్రత లేకుండా ఆలయం వద్దకు వస్తే.. తేనెటీగలు వారు ఆలయం ప్రాంగణం దాటే వరకు దాడి చేస్తాయని నమ్మకం.

●కాకులు రాని క్షేత్రం : కాటకోటేశ్వర క్షేత్ర ప్రాంతంలో ఒక్క కాకి కూడా కనబడదు. పూర్వం గుహల్లో నివాసముంటున్న అక్కదేవతలు ఇక్కడి కోనేటిలో స్నానం చేస్తుండగా.. కాకులు వారి వస్త్రాలపై రెట్టలు వేశాయట. దీంతో వారు కాకులు ఆ ప్రాంతంలోకి రాకూడదంటూ శపించారు. దీంతో నాటి నుంచి ఈ ప్రాంతానికి కాకులు రావని భక్తుల నమ్మకం. అంతేకాకుండా ఇక్కడ ఉన్న గదే గుండంలో స్నానం చేస్తే సకల రోగాలు నయమవుతాయని ఇక్కడి వారి విశ్వాసం.

● భారీగా ఏర్పాట్లు : కాటకోటేశ్వరక్షేత్రంలో మంగళ, బుధవారాల్లో శివరాత్రి ఉత్సవాలను భారీ భద్రత నడుమ నిర్వహించడానికి ఏర్పాటు చేస్తున్నారు. చిల్లవారిపల్లి గ్రామం నుంచి స్వామి ఉత్సవ విగ్రహాలు, ఆభరణాలు, యలవగంపల్లో కొలువురు తీర్చి చెక్కగుర్రాలపై ఊరేగింపుగా మంగళవారం రాత్రి కాటకోటేశ్వరక్షేత్రానికి తీసుకొస్తారు. బుధవారం ఉదయం అగ్నిగుండ ప్రవేశం చేస్తారు. సాయంత్రానికి తిరిగి ఉత్సవ విగ్రహాలు, ఆభరణాలు, గుర్రాలు, యలవగంపల్లో ఉంచి చిల్లవారిపల్లి గ్రామానికి తీసుకెళ్లడంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి.

బాల్యవివాహాల టోల్ ఫ్రీ నంబరే తెలీదా..!

మొదట మీరు అవగాహన పెంచుకోండి .. ఉద్యోగులకు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి చురక



ఓడీసీ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలను అరికట్టడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరే మీకు తెలీదా.. ఇక మీరు ప్రజలకు ఏం అవగాహన కల్పిస్తారు. మొదట మీరే అవగాహన పెంచుకోండి.. తర్వాత ప్రజలకు అవగాహన కల్పిద్దురుగాని..' అని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డిపై అధికారులు, ఉద్యోగులపై అసహనం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం ఎమ్మెల్యే మాట్లాడారు. బాల్య వివాహాలు ఈ మండలంలోనే అధికంగా జరుగుతున్నాయని, జిల్లాల్లోనే ప్రథమ స్థానంలో ఉందని, వాటిని అరకట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రభుత్వం ఓ టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసిందని, దాని గురించైనా తెలుసా అని ప్రశ్నించాగా.. అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు మౌనంగా ఉండిపోయారు. దీంతో అవాక్కైన ఎమ్మెల్యే.. దీనిబట్టి చూస్తూ మీరు ప్రజలకు ఏ మాత్రం అవగాహన కల్పిస్తున్నారో ఇట్టే అర్థమవుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. మొదట మీరు 1098 టోల్ ఫ్రీ నెంబర్‌పై అవగాహన పెంచుకోండి.. తర్వాత ప్రజలకు కల్పించండని చురకలంటించారు.

● చెరువులోకి చేపపిల్లల విడుదల

కొత్తచెరువు : బుక్కపట్నం చెరువులోకి ఎమ్మెల్యే మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి 1.63 లక్షల చేపపిల్లలను వదిలారు. మత్స్యకారులకు ఉపాధి కల్పించాలన్న సంకల్పంతో ప్రభుత్వం చేపపిల్లలను సబ్సిడీ కింద చెరువుల్లోకి వదులుతున్నారన్నారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మిస్తున్న 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణాన్ని పరిశీలించారు. వెంటనే నిర్మాణాన్ని పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం వ్యవసాయ కార్యాలయం వద్ద అగ్రికల్చర్ గోదాములో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. వారి వెంట హిందూపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి సాలక్కగారి శ్రీనివాసులు, జిల్లా నాయకులు సామకోటి ఆదినారాయణ, మండల, టౌన్ కన్వీనర్‌లు అడపాల రామకృష్ణ, వలిపిశీన, కూటమి నాయకులు పాల్గొన్నారు.

● ఫిర్యాదుల స్వీకరణ

పుట్టపర్తిరూరల్ : స్థానిక ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో శనివారం ప్రత్యేకంగా గ్రీవెన్స్‌ను ఎమ్మెల్యే, మాజీ మంత్రి నిర్వహించారు. బాధితుల నుంచి పలు వినతులు స్వీకరించారు. ఆర్వీజే కళ్యాణ మండపం సమీపంలో నివాసముంటున్న ఖాజాహుస్సేన్ సతీమణి మహమ్మ దాబీకి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ. లక్ష చెక్కును ఆమె ఇంటివద్దకు వెళ్లి అందజేశారు.

సమయపాలన ఏదీ..?

విధులను నిర్లక్ష్యం చేస్తున్న ఉద్యోగులు

10.30 గంటలైనా ఆఫీసులకు తొలగని బీగాలు

పట్టించుకోని ఉన్నతాధికారులు



బడన్నపల్లిలో 10.20గంటలైనా తెరుచుకోని సచివాలయం

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని, ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారని ఆయా గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. బడన్నపల్లి, ఏలుకుంట్ల, నేలకోట, దర్శినమల, రేగాటిపల్లి, పోతుకుంట, రావులచెరువు తదితర గ్రామాల్లోని సచివాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా విధులకు వస్తున్నారని వాపోతున్నారు. ఉదయం 10.30 గంటలకు హాజరవుతున్నారని, అప్పటికి కూడా ఒకరి.. ఇద్దరు మాత్రమే వస్తున్నారని ఆయా గ్రామస్థులు తెలుపుతున్నారు. శనివారం బడన్నపల్లి గ్రామంలో గ్రామప్రజలు పనుల నిమిత్తం సచివాలయం వద్దకు వెళ్లారు. ఆ సచివాలయంలో ఆర్‌బీకేకు సంబంధించి అధికారి అక్కడే ఉండటంతో రైతులు ఆ సచివాలయం వద్దకు 10 గంటలకే వెళ్లారు. ఆ సమయానికి అధికారులు ఎవరూ రాకపోవడంతో అక్కడే నిరీక్షించారు. సిబ్బంది నింపాదిగా 10.30 గంటలకు వచ్చారు. ధర్మవరానికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామాల్లో కూడా ఈ ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదని, ఫీల్డ్ వర్క్ పేరుతో అసలు కార్యాలయానికే రావడం లేదని, ఉద్యోగులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీఓ సాయిమనోహర్‌ను సంప్రదించగా.. సచివాలయ ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, ఉదయం 10గంటలకు సచివాలయంలో హాజరై.. తర్వాత ఇతర ఫీల్డ్ వర్క్‌కు వెళ్లాలని చెప్పారు. అసలు సచివాలయానికే రాకుండా ఫీల్డ్‌లో ఉన్నామంటే కుదరదని, విధులను నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

టెక్నాలజీపై అవగాహన పెంచుకోండి


నమూనాలను తిలకిస్తున్న అధ్యాపకులు

ధర్మవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆధునిక యుగంలో విద్యార్థులు ఎప్పటికప్పుడు టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని అనంతపురం ఆర్ట్స్ కళాశాల జూవాలజీ అధ్యాపకుడు రాజశేఖర్ సూచించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని నాగలూరు వద్ద గల రూపారాజా పీసీఎంఆర్ పాఠశాలలో శనివారం విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించారు. విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రూపారాజా క్రిష్ణ, జగదీశ్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపల్ నరేశ్‌కుమార్‌రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేరుశనగ పంట పరిశీలన

తనకల్లు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారువాండ్లపల్లి, మార్పురివాండ్లపల్లి గ్రామాల రైతులు ఏఆర్ఎస్ సంస్థ ఉచితంగా అందించిన కదిరి - లేపాక్షి వేరుశనగను సాగుచేశారు. ఆ పంటను గుజరాత్‌కు చెందిన అఖిలభారత పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త షన్ముఖా, కదిరి ఎఆర్ఎస్‌కు చెందిన శాస్త్రవేత్త నరసింహులు, జనజాగృతి సంస్థ సిబ్బందితో కలిసి శనివారం పరిశీలించారు. మండల వ్యాప్తంగా 40 మంది రైతులు ఏఆర్ఎస్ ద్వారా అందించించి ఈ వేరుశనగ సాగుచేసినట్లు జనజాగృతి వ్యవసాయ సహాయకులు సుప్రియ, గరుడప్ప తెలిపారు.

ఇద్దరికి గాయాలు

ముదిగుబ్బ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులగుబ్బల సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరు గాయపడ్డారు. ఈదులపల్లి గ్రామానికి చెందిన గాంగాధర్, ఆదెప్ప ముదిగుబ్బ నుంచి స్వగ్రామానికి బైక్‌లో వస్తుండగా.. నాగులగుబ్బల సమీపంలో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో 108 సిబ్బంది వారిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

నల్లమాడ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎరువుల దుకాణాలను ఇంటర్నల్ స్క్వాడ్ ఆకస్మికంగా తనిఖీ చేసింది. వివిధ రకాల ఎరువుల బస్తాలను తూకాలు వేశారు. నల్లమాడలోని గోమోర్ ఎరువుల దుకాణంలో తూకాలు తక్కువగా ఉండటాన్ని గమనించిరు. రూ.2,16,200 విలువ చేసే 376 బస్తాల ఎరువులను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంటర్నల్ స్క్వాడ్ ధర్మవరం ఏడీఏ క్రిష్ణయ్య, ఏఓలు ముస్తఫా, శంకర్ నాయక్, రైతు సేవా కేంద్రం సిబ్బంది ఉన్నారు.

రేపు పీఎం కిసాన్ విడుదల

నంబులపూలకుంట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రతి రైతుకు సోమవారం పీఎం కిసాన్ సమాన్ నిధి యోజన కింద రైతుల ఖాతాల్లో రూ. రెండు వేలు జమ చేస్తున్నట్లు బీజేపీ జిల్లా సమాచార హక్కు చట్ట జిల్లా కన్వీనర్ జయరాములు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకాన్ని 2019లో ప్రారంభించి ఇప్పటి వరకు 18 విడతలుగా రైతుల ఖాతాల్లో నిధులు జమ చేశామన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మహేశ్

శివరాత్రిని ప్రశాంతంగా జరుపుకోండి

ధర్మవరం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): తాడిమర్రి మండలం కాటకోటేశ్వరక్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు అందరు కలిసికట్టుగా ప్రశాంతంగా జరుపుకోవాలని ఆర్డీఓ మహేశ్, డీఎస్పీ హేమంత్ కుమార్ సూచించారు. మహాశివరాత్రి ఉత్సవాలపై స్థానిక ఆర్డీఓ కార్యాలయ చాంబర్‌లో శనివారం చిల్లవారిపల్లి గ్రామస్థులు, అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. 2021లో జరిగిన ఘర్షణలు మరోసారి చోటుచేసుకోకుండా.. ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. ఎవరైనా సమస్యలు సృష్టిస్తే.. కఠిన చర్యలతో పాటు కేసులు కూడా నమోదు చేస్తామన్నారు. అనంతరం ఆర్డీఓ, డీఎస్పీ తాడిమర్రి మండలం చిల్లవారిపల్లి గ్రామానికివెళ్లి అక్కడ కూడా ప్రజలతో ఏడు కులాల కాపులతో సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ రంగరావు, ఎస్ఐ కృష్ణవేణి పాల్గొన్నారు.

బీడీ కార్మికులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఓబులు

కదిరిఅర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : బీడీ కార్మికులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేసి.. ఆదుకోవాలని బీడీ అండ్ సిగార్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ ఓబులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఎన్జీవో హోంలో నిర్వహించిన ఆ యూనియన్ రాష్ట్ర సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీడీ కార్మికులకు ప్రభుత్వం నేరుగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఈఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించాలని, బీడీ చట్టం 1966, కార్మికుల సంక్షేమ చట్టం 1976ను పునరుద్ధరించాలని కోరారు. బీడీ కార్మికుల కూలి పెంచాలని, బీడీ పరిశ్రమపై విధించే జీఎస్‌టీ నుంచి కార్మికులకు ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కో-కన్వీనర్ ఇక్బాల్‌హుస్సేన్, నాయకులు ఉమాగౌడ్, మున్నీ, చంద్రకళ, అసిన్‌తాజ్, సిఐటియు వెంకటేష్, జీఎల్ నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్, రామమోహన్ పాల్గొన్నారు.

బీజేపీ కమిటీ ఏర్పాటు


సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఓబుళరెడ్డి, లక్ష్మీరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా కుచ్చెపు సురేష్, రాజశేఖర్, కార్యదర్శిగా గిరిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బూదిలి సుదర్శన్, రాష్ట్ర ఆర్గానిక్ కన్వీనర్ శరత్‌కుమార్‌రెడ్డి, మండల కార్యదర్శి వీరాంజనేయులు నాయకులు రంగారెడ్డి, అశ్వర్థప్ప పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతిపై శిక్షణ

గాండ్లపెంట, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతిపై శిక్షణ శనివారం నిర్వహించారు. ఎంఈఓ క్రిష్టానాయక్ పిల్లల సమగ్రాభివృద్ధికి, వికసానికి అంశాల వారీగా కార్యకర్తలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, రీసోర్సు పర్సన్లు షబ్బీర్‌బాషా, శివశంకర్‌నాయుడు, సునీల్, కరుణాకర్, సూపర్‌వైజర్ పద్మావతమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎస్‌డీటీగా రవిప్రసాద్



కదిరిఅర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): కదిరి మండల సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్‌గా కరణం రవిప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జీ సీఎస్‌డీటీ సురేంద్ర బదిలీపై ధర్మవరం వెళ్లారు. ఆయన స్థానంలో ఓడీసీలో పనిచేస్తున్న సీఎస్‌డీటీ రవిప్రసాద్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ.. తలుపుల మండలానికి ఇన్‌చార్జీ సీఎస్‌డీటీగా బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు.

న్యూస్ బాక్స్

నేడు హంద్రీనీవా నీటికి గంగపూజ

హిందూపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : హంద్రీనీవా కాలువ ద్వారా హిందూపురం నియోజకవర్గంలో చెరువులను నింపేందుకు తీసుకొస్తున్న నీటికి ఆదివారం గంగపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పీఏ బాలాజీ తెలిపారు. ఉదయం 11గంటలకు హిందూపురం మండలం రాచపల్లివద్ద గంగపూజ ఉంటుందన్నారు. మొదటి విడతలో నియోజకవర్గంలోని 20చెరువులకు నీరు అందిస్తామన్నారు. మొదట మలుగూరు చెరువుకు నీరందించిన తరువాత ఇతర చెరువులకు మళ్లిస్తామన్నారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం..



పార్కులో గుంతను పరిశీలిస్తున్న చైర్మన్ డీఈ రమేష్

హిందూపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పారిశుధ్య పనులు వేగవంతంచేసి పట్టణాన్ని శుభ్రంగా ఉంచడమే లక్ష్యమంటూ మునిసిపల్ చైర్మన్ డీఈ రమేష్ అన్నారు. శనివారం పట్టణంలోని 10వ వార్డు ఎస్బీఓ లేఅవుట్‌లో ఉన్న పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా పార్కులో చిన్న పిల్లలు ఆడుకునే వస్తువులతోపాటు వ్యాయామ పరికరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో ఉన్న అన్ని పార్కులను అభివృద్ధి చేస్తామని ఎక్కడ కూడా పార్కుల స్థలాలు కబ్జాకాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి పార్కులకు ప్రహరీ, లైటింగ్ సిస్టం ఏర్పాటు చేస్తామన్నారు. దీనివల్ల ఆ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు అనుగుణంగా చేస్తామన్నారు. 9వ వార్డులో పారిశుధ్య పనులు పరిశీలించారు. చైర్మన్ వెంట కౌన్సిలర్ మంజుళ, నాయకులు నవీన్, మంజు, యుగందర్, ఆదిల్, అంజి పాల్గొన్నారు.

ఇంటిలో వండిన ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

హిందూపురం అర్బన్: ఇంటిలో వండిన స్వచ్ఛమైన ఆహారం తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని మునిసిపల్ చైర్మన్ డీఈ రమేష్, ఎంఈఓ గంగప్పలు పేర్కొన్నారు. స్థానిక ముక్కడిపేటలోని వేణు విద్యావిహార్‌లో కరస్పాండెంట్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఫుడ్ ఫేస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆహార అలవాట్లవల్ల ప్రతి ఒక్కరూ అనారోగ్యం పాలవుతున్నారన్నారు. కార్యక్రమంలో పాంచజన్య అధ్యక్షులు శ్రీనివాసులు, ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షులు రియాజ్, టీడీపీ నాయకుడు నవీన్ పాల్గొన్నారు.

మహాసభకు మంత్రికి ఆహ్వానం

పెనుకొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మార్చి2న ధర్మవరంలో నిర్వహిస్తున్న ప్రథమ కౌన్సిల్ మహాసభకు తప్పక హాజరు కావాలని కోరుతూ ఉద్యోగ సంఘం ప్రతినిధులు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితకు ఆహ్వాన పత్రికను అందజేశారు. శనివారం జిల్లా అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రామంజినేయులు, తాలూకా అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్, కార్యదర్శి నరసింహమూర్తి, ఉపాధ్యక్షులు సాదిక్, అంజినప్ప, ఉపాధ్యాయులు రంగేష్, ప్రభాకర్, తదితరులు మంత్రికి ఆహ్వానపత్రికను అందజేశారు.

విద్యార్థులకు ఆటల పోటీలు



గెలుపొందిన విద్యార్థులతో ఎంఈఓలు, ఉపాధ్యాయులు

పెనుకొండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : సైన్స్ దినోత్సవం సందర్భంగా పెనుకొండలో 30పాఠశాలల విద్యార్థులకు ఏడురకాల ఆటల పోటీలు నిర్వహించారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో గెలుపొందిన విద్యార్థులను వారి తల్లిదండ్రులు, ఎంఈఓలు చంద్రశేఖర్, సుధాకర్‌లు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఇలాంటి పోటీలవల్ల విద్యార్థుల మధ్య మంచి పోటీ ఏర్పడుతుందన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు.

రూ.8.52కోట్లతో బూదిలి వంతెన పనులు

గోరంట్ల, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలివద్దగల చిత్రవతి నదిపై రూ.8.52కోట్లతో హైలెవల్ వంతెన నిర్మాణం పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు పిఆర్‌ప్రాజెక్టు ఎస్ఇ జహీర్‌అల్మామ్ తెలిపారు. కొన్నేళ్లక్రితం చిత్రావతి నది ప్రవాహం వలన బూదిలి వంతెనకొట్టుకుపోగా, తాత్కాలిక వంతెన ఏర్పాటయింది. వంతెన దెబ్బతినడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇటీవల ప్రభుత్వం ప్రధానమంత్రి గ్రామీణసడక్ పథకం ద్వారా వంతెన నిర్మాణానికి రూ.8.52కోట్లు మంజూరు చేసింది. పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్ బద్వేల్‌రమణారెడ్డితోపాటు ప్రాజెక్టు అధికారులు బూదిలి వంతెనను శనివారం పరిశీలించారు. ఏడున్నర మీటర్ల వెడల్పుతో 160 మీటర్ల పొడవుతో హైలెవల్ వంతెన నిర్మాణం జరుగుతుందన్నారు. అనంతరం బిసి సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత చేతులమీదుగా భూమి పూజ త్వరలో జరుగుతుందన్నారు. వెంటనే ఏర్పాట్లు చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

మహాసభలను విజయవంతం చేద్దాం

మడకశిరటౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రైవేట్ మెడికల్, ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25వతేదీన జరిగే 30వ వార్షికోత్సవ మహాసభలను విజయవంతం చేద్దామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అన్నారు. శనివారం మడకశిరలో అసోసియేషన్ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేట్ మెడికల్స్, ఆర్ఎంపీ డాక్టర్ల అసోసియేషన్ సభ్యులు పలు సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారని, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాలోకేష్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు గుండుమల తిప్పేస్వామి తెలిపారు.

లైన్‌మ్యాన్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

గుడిబండ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరగల్లు గ్రామంలో లైన్‌మ్యాన్ వేణుగోపాల్ అవినీతి అక్రమాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సర్పంచు జయమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ గ్రామంలోని తాగునీటి బోరుకు ట్రాన్స్‌ఫార్మర్ మార్చేందుకు లైన్‌మెన్ రూ.12వేలు లంచం అడిగారని అతని అవినీతి అక్రమాలపై కలెక్టర్ చేతన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈవిషయమై ఏఈ విశ్వనాథ్ మాట్లాడుతూ, లైన్‌మెన్ అవినీతికి పాల్పడితే పై చర్యలు తీసుకుంటామన్నారు.

వేసవి గట్టెక్కేదెలా?

- దంచి కొడుతున్న ఎండలు.. మార్చి రాకనే ఉక్కపోత
- కూలర్లు, ఫ్యాన్లకు పెరిగిన డిమాండ్



చిలమత్తూరులోసిద్ధంగా ఉంచిన ఎయిర్ కూలర్లు

చిలమత్తూరు, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రారంభం కానేలేదు. అప్పుడే ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 7 గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపెడుతున్నాడు. వేడి గాలులతో పాటు మధ్యాహ్న సమయంలో తీవ్ర ఉక్కపోత కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండ...వేడి...ఉక్కపోతను తట్టుకునేందుకు వేసవి కాలం రాకమునుపే ప్రత్యామ్నాయ మార్గాలకు సిద్ధపడుతున్నారు.. ఇదే సమయంలో ఇంట్లో కూలర్, ఏసీలకు పని కల్పిస్తున్నారు. ఫ్యాను గాలి ఏ మాత్రం వేడి నుంచి ఉపశమనం ఇవ్వకపోవడంతో కాస్తంత స్తోమత ఉన్న వారు కూలర్లను కొనుగోలు చేస్తున్నారు. సగానికి పైగా ఇళ్లల్లో నేడు కూలర్లు దర్శనమిస్తున్నాయి. కొందరు బడా బాబులు ఏసీలు కొనుగోలు చేసుకుంటున్నారు.

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

గత వారం రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. డిసెంబరు, జనవరి మాసాలలో తీవ్ర మంచు ప్రభావంతో శీతల గాలులు వీచాయి. ఇదే వాతావరణం గత వారం రోజుల వరకు కొనసాగింది. అయితే గతంలో పోలిస్తే ఈసారి ఎండలు ఫిబ్రవరి నెలలోనే దంచి కొడుతున్నాయి. రాష్ట్రంలో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. పగటి ఉష్ణోగ్రత 35 డిగ్రీల సెల్సియస్ దాటుతోంది. ఎండ తీవ్రతతో మధ్యాహ్నం రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండకు బయట తిరగకుండా రక్షణ చర్యలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు కూలర్లు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు కొనుగోలు చేస్తుండటంతో దుకాణాల్లో సందడి నెలకొంది. గతంలో సీలింగ్ ఫ్యాన్లకు గిరాకీ ఉండేది. ఇప్పుడు అలా లేదు. అందరూ కూలర్ల వైపు చూస్తున్నారు. ప్రతి చిన్న ఇంట్లో సైతం కూలర్‌ని ఏర్పాటుచేసుకుంటున్నారు. వాటి ధరలు కూడా అందుబాటులో ఉండటంతో ప్రతి ఒక్కరు వాటిపైనే మొగ్గు చూపుతున్నారు. మధ్యతరగతి వారికి అవి ఎంతో ఉపయోగంగా ఉండటంతో వాటికి గిరాకీ పెరిగింది. మరింత స్తోమత ఉన్నవారు ఏసీలను ఏర్పాటుచేసుకుంటున్నారు. దీంతో వేసవి కాలం ప్రారంభంకాకనే ముందస్తుగా ఉష్ణతాపం నుంచి తప్పించుకోవడానికి జనం ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకుంటున్నారు.

లేపాక్షిలో శివరాత్రి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

లేపాక్షి, ఫిబ్రవరి22(ఆంధ్రజ్యోతి): లేపాక్షి దుర్గావీరభద్రస్వామి ఆలయంలో ఈనెల 25నుంచి మార్చి1 వరకు శివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఈఓ నరసింహమూర్తి తెలిపారు. 25న మహాగణపతి సుదర్శన హోమం, అంకురార్పణతో కార్యక్రమాలను ప్రారంభిస్తామన్నారు. 26న దీపోత్సవం, రుద్రాభిషేకం, కళ్యాణోత్సవం, 27న స్వామివారి బ్రహ్మరథోత్సవం 28న చండీహోమం, రాత్రికి ముత్యాలపల్లకి, మార్చి 1న వసంతోత్సవం, ధ్వజావరోహణ నిర్వహిస్తామన్నారు.

ఉచిత న్యాయసహాయాన్ని పొందండి

హిందూపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని ఖైదీలు కోర్టు ద్వారా ఉచిత న్యాయాన్ని పొందవచ్చని సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శ్రీధర్ అన్నారు. శనివారం స్థానిక సబ్‌జైలును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ ఎవరెవరు ఏయే కేసులపై జైలుకు వచ్చారని ఆరాతీశారు. జైలు నుంచి బయటికి వచ్చాక సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. జైలులో అందుతున్న సౌకర్యాలపై ఆరాతీశారు. జైల్‌అధికారి హనుమప్ప, న్యాయవాదులు పాల్గొన్నారు.

వన్ వేతో ప్రయాణికుల ఇక్కట్లు

దుకాణాల ముందు మెట్ల నిర్మాణం
బైక్ పార్కింగ్‌కు స్థలం కొరత

సోమందేపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని పెద్దమ్మ గుడివద్ద రోడ్డును ఇటీవల విస్తరించి వన్‌వేగా మార్చడంతో ప్రయాణికులు ఇబ్బందులపాలవుతున్నారు. వాణిజ్య సముదాయాల యజమానులు తమ దుకాణాల ముందు మెట్లు అరుగులు వేసుకోవడంతో ద్విచక్రవాహనదారులకు పార్కింగ్ కరువైంది. దీంతో సగం రోడ్డును ఆక్రమించి ఇష్టారీతిన వాహనాలను నిలుపుతుండటంతో బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారింది. అంబేద్కర్ సర్కిల్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ఇదే పరిస్థితి నెలకొంది. పోలీసులు సైతం వాహనదారులకు హెచ్చరికలు జారీచేసినా ప్రయోజనం లేకపోయింది. దీనికితోడు తోపుడు బండ్లు, చిరువ్యాపారస్థులు రోడ్డుపై దుకాణాలు పెడుతుండటంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొందని దీంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2003లో దివంగతనేత పరిటాల రవీంద్ర చొరవతో పెద్దమ్మగుడికి కూతవేటు దూరంలో రెండెకరాల స్థలంలో ప్రజల సౌకర్యార్థం బస్టాండును నిర్మించారు. అప్పట్లో పట్టణం అభివృద్ధి చెందకపోవడంతో ప్రజలు బస్టాండును ఉపయోగించుకోవడానికి ముందుకు రాలేదు. ప్రస్తుతం పరిస్థితులు అనుకూలంగా మారడంతో ఆర్టీసీ బస్టాండును జిల్లా అధికారులు వినియోగంలోకి తీసుకువస్తే ట్రాఫిక్ సమస్య నివారించవచ్చని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కరించి బస్టాండును వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ రోడ్డుపై ఉన్న రద్దీదృష్ట్యా ద్విచక్రవాహనాల పార్కింగ్ తలనొప్పిగా మారుతోందని, ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు కృషిచేస్తున్నా మన్నారు. త్వరలో ఆర్టీసీ బస్టాండును ప్రారంభిస్తే పట్టణం అభివృద్ధి చెందడంతోపాటు ట్రాఫిక్ సమస్య పరిష్కారం అవుతుందన్నారు.



నిరుపయోగంగా ఉన్న ఆర్టీసీ బస్టాండు (ఫైల్)

అక్రమంగా కలప నిల్వ ఉంచితే కేసులు

మడకశిరటౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా కలపను నిల్వ ఉంచినా, అక్రమంగా తరలించినా కలప విలువ ధరల ఆధారంగా కేసులు నమోదు చేయనున్నట్లు ఎఫ్ఓ హైజాక్‌బాబు తెలిపారు. శనివారం ఆంధ్రజ్యోతి పత్రికలో తరలిపోతున్న వృక్ష సంపద అన్న కథనానికి స్పందించిన జిల్లా అటవీ శాఖ అధికారి చక్రపాణి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సామిల్‌లను తనిఖీ చేస్తూ అందులో అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన కలప ఆధారంగా జరిమానాలు విధించనున్నట్లు తెలిపారు. ఐదు మండలాల పరిధిలోని సామిల్‌లను తనిఖీ చేశారు. అదేవిధంగా ఇటుకబట్టీలను కూడా తనిఖీ చేశారు.

అధికారి అక్రమాలు బయట పెట్టినందుకే తనిఖీలు: వీరభద్రప్ప,

మడకశిర ఫారెస్టు అధికారి తన సామిల్ నడవకుండా ఇబ్బందులు పెట్టారని, ప్రస్తుతం తన లైసెన్స్ రెన్యూవల్ కాకుండా ఇబ్బందులు పెడుతున్నారని, తననేలక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నట్లు సామిల్ యజమాని వీరభద్రప్ప ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు.

విజ్ఞానంతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించగలం



విద్యార్థులు తయారు చేసిన రోబోను పరిశీలిస్తున్న ముఖ్య అతిథులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : విజ్ఞానంతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించగలమని అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి లలితా లక్ష్మీ పేర్కొన్నారు. పాంచజన్య పాఠశాలలో అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవాలని తద్వారా వారు ఉన్నత శిఖరాలు చేరుకుంటారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏర్పాటుచేసిన రోబోలు అడవుల సంరక్షణ, స్నోవరల్డ్ ప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, కరస్పాండెంట్ నందకుమార్, ఏడీ స్మిత తదితరులు పాల్గొన్నారు.

విద్యకు చేయూతనిచ్చిన బర్జర్ పెయింట్స్

- నాలుగు పాఠశాలలకు రూ.10లక్షల ల్యాబ్ పరికరాలు అందజేత



పరిశ్రమ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

హిందూపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : పరిశ్రమ అన్నాక లాభాపేక్షతోనేకాకుండా సేవాపేక్షతో కూడా పనిచేస్తుందని తూముకుంట బర్జర్ పెయింట్స్ పరిశ్రమ హెడ్ వెంకటప్పరావు, హెచ్‌ఆర్ మేనేజర్ దేవరాజు అన్నారు. సీఎస్ఆర్ కింద స్టీం, సైన్స్ టెక్నాలజీ ఇంజనీరింగ్‌కు సంబంధించిన రూ.10లక్షల విలువచేసే పరికరాలను పట్టణంలోని అజీజియ, నేతాజీ, చౌళూరు, కొట్నూరు పాఠశాలలకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పెయింట్స్ పరిశ్రమ విద్యా, వైద్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయాపాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

గోరంట్ల, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : చౌకధ్యాపు డిపోల ద్వారా నిత్యవసర వస్తువులు పంపిణీ చేస్తున్న డీలర్లు, ఎండియు ఆపరేటర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ మారుతి హెచ్చరించారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో డీలర్లు, ఎండియు ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ప్రజలనుంచి ఫిర్యాదులు రాకుండా పనిచేయాలన్నారు.

కాంట్రాక్టర్ల సమస్యలను పరిష్కరించండి

పావగడ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : దాదాపు రెండేళ్ల నుండి కాంట్రాక్ట్ ఒప్పందం ప్రకారం చేసిన పనులకు ప్రభుత్వం నుండి నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ల పరిస్థితి పోరాటాలు చేయాల్సిన స్థితికి చేరుకుందని కాంట్రాక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి పాలేకర్ లోకేష్ తెలిపారు. శనివారం ఆర్అండ్‌బి గెస్టుహౌస్‌లో కాంట్రాక్టర్ల సంఘం తరఫున నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా పనుల శాఖ జిల్లా పంచాయతీ, తాగునీటిశాఖ వివిధ కార్యాలయాల ద్వారా తాగునీటి పనులు పూర్తిచేసినప్పటికీ బిల్లులు మంజూరు చేయక ఖజానా ఖాళీ అంటూ ప్రభుత్వం చేతులెత్తేయడం విడ్డూరంగా ఉందన్నారు.

హేమావతిలో ముందస్తు ఏర్పాట్లు

అమరాపురం, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రసిద్ధి పొందిన హేమావతి క్షేత్రంలో శివరాత్రి సందర్భంగా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 26వతేదీన మహా శివరాత్రి సందర్భంగా గ్రామాల్లో గుంతలమయంగా ఉన్నటువంటి రోడ్లను పూడ్చాలని అధికారులను ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్నటువంటి కంపచెట్లను తొలగించి, గుంతలమయంగా ఉన్న చోట్ల మట్టిని తోలి చదును చేయాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఆదేశించారు. శివరాత్రి సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ స్థలాలు, తాగునీరు, ఇతర ప్రాంతాలకు వెళ్లేవారికి బస్సు సౌకర్యాలు కల్పించాలని వారు ఆదేశించారు. ఈ మేరకు పనులు వేగంగా జరుగుతున్నాయి.

అగళిలో ప్రీమియర్ లీగ్ సీజన్-2 టోర్నమెంట్

అగళి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): అగళి మండల కేంద్రంలో ప్రీమియర్ లీగ్ సీజన్-2ను మార్చినెల 7,8,9 తేదీలలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గోవిందరాజులు, రవికుమార్ తెలిపారు. ఈ మెగా టోర్నమెంట్‌లో ఇప్పటికే 8జట్లు పాల్గొన్నాయన్నారు. ఈ టోర్నమెంట్‌లో మొదటి బహుమతి కింద మడకశిర తాలూకా గ్రీన్ బారత్ ఫౌండేషన్ అధ్యక్షులు కామరాజు రూ.30వేలు, రెండో బహుమతిగా అగళి టీడీపీ ఎల్ఎస్ వెల్డింగ్ వర్క్ నరసింహమూర్తి రూ.10వేలు ప్రదానం చేయనున్నట్లు వారు తెలిపారు.

కందులు కొనుగోలు ప్రక్రియ వేగవంతం

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) కందుల కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వైవి సుబ్బారావు మార్క్‌ఫెడ్ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా శనివారం రొద్దం, తురకలాపట్నంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో రైతుల నుంచి కందులు కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. మార్క్‌ఫెడ్ ఏజెన్సీ కొనుగోలు చేస్తున్న కేంద్రాలను తనిఖీ చేసి వరికి తగు సూచనలు, సలహాలు అందించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రచారం

హిందూపురం, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాణిజ్య నివాసప్రాంతాల్లో సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని టూటౌన్ ఇన్చార్జ్ సీఐ జనార్దన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో ప్రతి ఒక్కరూ షాపుల వద్ద సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆటో ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు.

దేవాలయాల పునర్విభజనపై ఉత్తర్వులు

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు దేవాలయాలను కేటగిరి వారిగా పునర్వర్గీకరణ చేస్తూ దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఇందులో భాగంగా మడకశిర మండలం జిల్లేడుకుంట భక్తరహళ్లి ఆంజనేయ లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని ఏ కేటగిరి నుంచి బీ కేటగిరికి, నసనకోట ముత్యాలమ్మ దేవాలయాన్ని సీ నుంచి బీ కేటగిరికి, ధర్మవరం పాండురంగస్వామి దేవాలయం, లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం, తాడిమర్రి మండలంలోని కాటకోటేశ్వరస్వామి దేవాలయం, హిందూపురం సుగూరు ఆంజనేయస్వామి దేవాలయం, హిందూపురం పేట వెంకటరమణస్వామి దేవాలయం, గుడ్డం రంగనాథస్వామి దేవాలయం, అనంత పద్మనాభస్వామి దేవాలయం, నానెప్ప చౌల్ట్రీలను బీ నుంచి సీ కేటగిరికి మారుస్తూ ఉత్తర్వులు జారీచేశారు.



రొద్దం పెద్దచెరువులో చేప పిల్లలను వదులుతున్న మంత్రి సవిత

మత్స్యకారులకు పూర్వ వైభవం

బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం రాకతో పూర్వవైభవం వచ్చిందని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం రొద్దం పెద్దచెరువులో మత్స్యశాఖ అధికారులతో కలిసి లక్ష చేపపిల్లలను చెరువులోకి వదిలారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో రైతులు పండించిన పంటలకంటే అధికంగా గంజాయి పండిందని ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో నిర్వీర్యమైన మత్స్యశాఖకు ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్వవైభవం తీసుకొచ్చారని తెలిపారు. గతంలో మత్స్యకారులు ఉపాధి కోసం నానా అవస్థలు పడ్డారని అన్నారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని జగన్ చేసిన వ్యాఖ్యలపై ఓ విలేకరి అడిగినప్రశ్నకు మంత్రి ఘాటు వ్యాఖ్యలు చేశారు. వైసీపీ పార్టీ ఎప్పుడో చచ్చిందని, జగన్‌కు మైండ్ దొబ్బిందని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు, టీడీపీ నాయకులు మాధవనాయుడు, అశ్వర్థనారాయణ, నరహరి పాల్గొన్నారు.

12 మందికి సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కును పంపిణీ చేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : వైద్యం కోసం ఆర్థికంగా నష్టపోయిన వారికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం భరోసా ఇస్తుందని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో 12మంది బాధితులకు శనివారం రూ.5,63,816ల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ క్రమంలో మంత్రి సవితకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నారాయణస్వామి, కన్వీనర్ శ్రీరాములు, బలిజసంఘం అధ్యక్షులు సూరీ, రామక్రిష్టప్ప, శ్రీనివాసులు, త్రివేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో సరస్వతి పూజ



సరస్వతి పూజలో కళాశాల విద్యార్థులు

గోరంట్ల, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్ఎపిఎస్, జూనియర్ కళాశాలలో సరస్వతీ పూజ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పురోహితులు కీర్తినాథ్‌శర్మ ఆధ్వర్యంలో గణపతి, సరస్వతి పూజలు నిర్వహించారు. కరస్పాండెంట్ కెంపుల లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు చదివిన అంశాలను గుర్తుంచుకుని, ప్రశాంతంగా ఆలోచించి, పరీక్షలు రాసి, మంచి ఉత్తీర్ణత సాధించడానికి సరస్వతి దేవి ఆశీస్సులు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు రమేష్, రామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో 10వతరగతి విద్యార్థులు నిర్వహించిన సరస్వతి పూజకు ఎంపీడీఓ నరేంద్రకుమార్, ఎంఇఓ గోపాల్ హాజరైనట్లు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు.

కొబ్బరి చెట్టుపై నుంచి పడి యువకుడి మృతి




చెట్టుపై నుంచి పడి మృతిచెందిన నవీన్

లేపాక్షి, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : కంచిసముద్రం గ్రామం వివేకానంద జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వెనుకాల ఉన్న పొలంలో టెంకాయ చెట్టుఎక్కి కొబ్బరికాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు అక్కడి నుంచి పడి యువకుడు మృతిచెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు కర్నాటక ప్రాంతం బొమ్మసముద్రం గ్రామానికి చెందిన నవీన్(23) గత కొన్నినెలల నుంచి కంచిసముద్రం ఎస్సీ కాలనీలో నివాసముంటున్నాడు. ఇతనికి బంధువులు ఎవరూ లేరు. చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవిస్తుండేవాడు. ఇతనికి మూర్ఛ వ్యాధి ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు. శనివారం హైస్కూల్ పొలం వద్ద ఎవరూ లేని సమయంలో టెంకాయ చెట్టుపై ఎక్కి టెంకాయలు కోస్తుండగా ఫిట్స్ వచ్చి పడిపోయి ఉంటాడని గ్రామస్థులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు పోలీసు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

తండ్రి మందలించాడని కుమార్తె ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, ఫిబ్రవరి22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లాపల్లి గ్రామానికి చెందిన యువతి శ్వేత తండ్రి మందలించాడనే కోపంతో విషద్రావకం తాగి శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆమె తండ్రి మందలించడంతో తీవ్ర మనస్థాపానికి గురైంది. మొక్కజొన్న పొలం కోసం ఉంచిన క్రిమిసంహార గుళికలను సేవించి, అస్వస్థతకు గురైంది. ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా వైద్యులు చికిత్సలు చేసి, మెరుగైన వైద్యంకోసం 108లో హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

తేనెటీగల దాడిలో వ్యక్తి మృతి



తేనెటీగల దాడిలో మృతి చెందిన రమేష్

పావగడ, ఫిబ్రవరి 22(ఆంధ్రజ్యోతి) : తిరుమణి పోలీస్ స్టేషన్ పరిధిలోని టీకే హళ్లి గ్రామంలో కూలి పని కోసం వెళ్లిన రమేష్(28)అనే వ్యక్తి తేనెటీగలు దాడిచేయడంతో అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. నీలంమనహళ్లి గ్రామానికి చెందిన రమేష్ ప్రతిరోజు చెట్ల కాయలు కోయడానికి వెళుతుంటాడు. శనివారం కూడా అదే మాదిరిగా వెళ్లి కూలి పనులు చేస్తుంటే అకస్మాత్తుగా తేనెటీగలు అతడిపై దాడిచేశాయి. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతిచెందాడు. బంధువులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు. గ్రామస్థుల సహకారంతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామన్నారు.